షణ్ముఖ వెలుగు
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152
ప్రతి వార్త వెలుగు వైపు · తెలుగు దినపత్రిక
1st Year · Happy Work Anniversary.
Good for Health · Best for Readers
సంపుటి : 3 సంచిక : 48 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 18 ఫిబ్రవరి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు
VOLUME : 03 ISSUE : 48 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Wednesday 18 February 2026 PAGES : 8 PRICE : 3/-


# గత ప్రభుత్వం తెచ్చిన ఆ జీవో పిల్లలను స్కూళ్లకు దూరం చేసింది



- వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీవో 117తో ప్రభుత్వ స్కూళ్లకు దూరమయ్యారన్న మంత్రి
- వన్ క్లాస్ - వన్ టీచర్ పాఠశాలలను 33 శాతానికి పెంచామన్న నారా లోకేశ్
- రూ.1000 కోట్లతో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని వెల్లడి
- శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేశ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 17)

గత ప్రభుత్వం 2019-24 సమయంలో జీవో 117 తీసుకురావడంతో పేద పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని, ఈ క్రమంలో ఎన్నికల సమయంలో తాము ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ప్రజాప్రభుత్వం వచ్చాక ఆ జీవోను రద్దు చేశామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ, గత ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం చేపట్టిన తర్వాత కూడా 233 పాఠశాలలు మూసివేసే పరిస్థితి ఏర్పడిందని అన్నారు.అంతేకాకుండా పాఠశాల విద్యాభివృద్ధిలో వన్ క్లాస్ - వన్ టీచర్ విధానం చాలా కీలకమైందని, గతంలో 3 శాతం పాఠశాలల్లో మాత్రమే వన్ క్లాస్ - వన్ టీచర్ ఉంటే, ఇప్పుడు 33 శాతానికి పెంచామని అన్నారు. దీనిద్వారా పిల్లలకు మెరుగైన విద్య అందడంతో పరీక్షల్లో మెరుగైన ఫలితాలు వస్తాయని అన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించి ప్రధానంగా 5 అంశాలను పరిగణనలోకి తీసుకున్నామని అన్నారు. ప్రధానంగా లీక్ ప్రూఫ్ బిల్డింగ్, పెయింట్స్, బెంచీలు, టాయ్ లెట్స్, -మిగతా 2లో

## చదువుతో పాటు ఇవి కూడా ఉండాలి... ఈ మేరకు చంద్రబాబు, లోకేశ్ లను కోరుతున్నాను: నాగబాబు

ప్రైవేట్ విద్యార్థుల కోసం 'కామన్ ప్లే గ్రౌండ్ సిస్టమ్' ప్రతిపాదన

ప్రభుత్వ పాఠశాలల మైదానాలను రుసుముతో వాడుకునే అవకాశం

విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించి, శారీరక ఆరోగ్యాన్ని పెంచడమే లక్ష్యం


2


## తొలి ట్రిలియనీర్‌గా మస్క్? రికార్డు దిశగా కుబేరుడు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 17)

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సరికొత్త రికార్డుకు చేరువవుతున్నారు. ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా మారనున్నారు. ఈ ఏడాదిలోనే ఆ మార్క్ చేరనున్నారని అంచనాలు ఉన్నాయి.ఈ ఫిబ్రవరి నాటికి 800 బిలియన్ డాలర్ల మార్క్ దాటిన తొలివ్యక్తిగా మస్క్ నిలిచారు. ప్రస్తుతం ఆయన సంపద 850 బిలియన్ డాలర్లుగా ఉంది. ప్రపంచంలో అత్యధిక సంపద కలిగిన కుబేరుల జాబితాలో ఉన్న గూగుల్ సహ వ్యవస్థాపకులు లారీ పేజ్ , సెర్గీబ్రిన్ , మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ .. ఈ ముగ్గురి నికర విలువ కంటే మస్క్‌దే ఎక్కువ కావడం గమనార్హం. ట్రిలియన్ డాలర్ల మార్క్ దిశగా ఆయన సంపద వేగంగా పెరగడం వెనక స్పేస్‌ఎక్స్, ఎక్స్‌ఏఐ మధ్య ఇటీవల కుదిరిన ఒప్పందం కీలకంగా మారింది. కృత్రిమ మేధ, సోషల్ మీడియా సంస్థ ఎక్స్‌ఏఐని గత వారం 1.25 ట్రిలియన్ డాలర్లతో స్పేస్‌ఎక్స్ కొనుగోలు చేసింది. విలీనం అయిన సంస్థలో ఆయన వాటా 43 శాతంగా ఉంది. ఆ వాటా విలువే 530 బిలియన్ డాలర్లు. -మిగతా 2లో

## ఏఐ ఇంపాక్ట్ సదస్సుకు బిల్‌గేట్స్ దూరం.. ఎప్‌స్టీన్ వ్యవహారమే కారణమా..?



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 17)

భారత్ ఆతిథ్యమిస్తున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు కు మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ హాజరుకాకపోవచ్చని తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్‌కు సంబంధించి ఇటీవల విడుదలైన ఫైళ్లలో ఆయన పేరు కూడా ఉంది. దాంతో గేట్స్‌కు ఇచ్చిన ఆహ్వానాన్ని కేంద్ర ప్రభుత్వం సమీక్షించిందని సమాచారం. ప్రభుత్వ వర్గాలను ప్రస్తావిస్తూ ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రభుత్వం బాధితుల పక్షాన నిలబడాలని కోరుకుంటుందని పేర్కొన్నాయి. ఇటీవల ఎప్‌స్టీన్ ఫైళ్లను అమెరికా ప్రభుత్వం

## విశాఖలో రాష్ట్రపతి ముర్ముకు స్వాగతం పలికిన గవర్నర్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

విశాఖపట్నం చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష-2026లో ముఖ్య అతిథిగా హాజరు

నగరంలో కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు

మిలన్ పరేడ్‌తో పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న రాష్ట్రపతి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 17)

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నేటి సాయంత్రం విశాఖపట్నం చేరుకున్నారు. నగరంలోని ఐఎన్ఎస్ డేగా నౌకాదళ విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో వచ్చిన ఆమెకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, -మిగతా 2లో

## వైసీపీ నేతల్లారా... సిగ్గుపడండి! మండలిలో అచ్చెన్నాయుడు ఫైర్

లడ్డూ కల్తీని నాటి టీటీడీ చైర్మనే ఒప్పుకున్నారన్న అచ్చెన్న

వైసీపీ నేతలు సిగ్గులేకుండా ఎదురుదాడి చేస్తున్నారని విమర్శ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 17)

తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో వైసీపీ నేతలపై ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ.. లడ్డూలో కల్తీ జరిగిందని నాటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డే స్వయంగా ఒప్పుకున్నాక కూడా, వైసీపీ నేతలు సిగ్గులేకుండా ఎదురుదాడి చేయడం దుర్మార్గమని మండిపడ్డారు."తప్పు ఒప్పుకున్నాక కూడా బుకాయిస్తారా? వైసీపీ నేతల్లారా సిగ్గుపడండి" అని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. కోట్ల మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసి, పవిత్ర ప్రసాదాన్ని అపవిత్రం -మిగతా 2లో

## సామాజిక మాధ్యమాల వినియోగంపై వయసుల వారీ పరిమితులు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 17)

సామాజిక మాధ్యమాల వినియోగంపై వయసుల వారీ పరిమితులు విధించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా ఆయా టెక్ కంపెనీలతో (సామాజిక మాధ్యమాలు) చర్చలు జరుపుతోంది. సోషల్‌మీడియా వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాల దృష్ట్యా ఫ్రాన్స్, ఆస్ట్రేలియా..తదితర దేశాలు చిన్నారులు సోషల్‌మీడియా వినియోగంపై నిషేధం విధించాయి. ఈ నేపథ్యంలో భారత్ కూడా ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో భాగంగా కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. "ప్రస్తుతం మేం డీప్‌ఫేక్‌లు, వయసు ఆధారిత నియంత్రణలపై వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లతో చర్చలు జరుపుతున్నాం. అనేక దేశాలు వయసు ఆధారిత నియంత్రణలను అంగీకరించాయి. భారతదేశంలో ఇది అవసరమని భావిస్తున్నాం" అని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. బడ్జెట్ సందర్భంగా ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే సైతం డిజిటల్ ఎడిక్షన్‌ను తగ్గించేందుకు వయసు -మిగతా 2లో

## చంద్రబాబుతో ఉంటే బిల్ గేట్స్‌ను కలుస్తారు... జగన్‌ను నమ్ముకుంటే గేటు బయటే ఉంటారు

చంద్రబాబు, జగన్ తీరును పోలుస్తూ రెండు ఫొటోలతో పార్థసారథి సోషల్ మీడియాలో పోస్ట్

అమరావతిలో చంద్రబాబుతో భేటీ అయిన మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్

డిజిటల్ పాలనలో చంద్రబాబు కృషి అమోఘమని బిల్ గేట్స్ ప్రశంస

భారత డిజిటల్ విప్లవంలో మోదీ, చంద్రబాబు కీలకపాత్రధారులని కితాబు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 17)

మాజీ ముఖ్యమంత్రి జగన్ ను ఉద్దేశించి ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "చంద్రబాబు గారితో ఉంటే బిల్ గేట్స్‌ను కలుస్తారు... జగన్‌ను నమ్ముకుంటే గేటు బయటే ఉంటారు" అంటూ సోషల్ మీడియా వేదికగా ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆయన రెండు ఫొటోలను పోలుస్తూ ఒక పోస్ట్ పెట్టారు.ఒక ఫొటోలో వైసీపీ అధినేత జగన్ తన ఇంటి నుంచి బయటకు వస్తుండగా, పలువురు వైసీపీ నేతలు గేటు బయట వేచి ఉన్న దృశ్యాన్ని మంత్రి పంచుకున్నారు. మరో ఫొటోలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌తో పాటు తాను, ఇతర మంత్రులు కలిసి ఉన్న చిత్రాన్ని జతచేశారు. -మిగతా 2లో

## ఏపీలో టెక్ పాలన అమోఘం... సోషల్ మీడియాలోనూ ఆశ్చర్యం వ్యక్తం చేసిన బిల్ గేట్స్!

సీఎం చంద్రబాబుతో కలిసి ఆర్టీజీఎస్ సందర్శన

పాలనలో, అభివృద్ధిలో టెక్నాలజీ వినియోగాన్ని చూసి ఆశ్చర్యపోయిన గేట్స్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 17)

కృత్రిమ మేధ (ఏఐ), టెక్నాలజీ వినియోగంతో ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న అభివృద్ధిని చూడటం ఎంతో ఉత్సాహంగా అనిపించిందని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యటనలో తనకు ఘన స్వాగతం పలికినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆయన చంద్రబాబు చేసిన ట్వీట్ ను ఎక్స్ ఖాతాలో రీపోస్ట్ చేశారు.నిన్న (ఫిబ్రవరి 16న) బిల్ గేట్స్ ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు.



గన్నవరం విమానాశ్రయంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, ఇతర మంత్రులు ఆయనకు స్వాగతం పలకగా, అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఆహ్వానించారు. అనంతరం చంద్రబాబుతో కలిసి ఆయన రియల్ టైమ్ గవర్నెన్స్ సిస్టమ్ కేంద్రాన్ని సందర్శించి, దాని పనితీరును అడిగి -మిగతా 2లో

## గత ప్రభుత్వం తెచ్చిన ఆ జీవో పిల్లలను

# స్కూళ్లకు దూరం చేసింది

తాగునీరు అందించాలని నిర్ణయించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు రేటింగ్ ఇచ్చామని, ఏపీలో 5 స్టార్ రేటింగ్ ఉన్నవి లేవని వెల్లడించారు. 40 శాతం 1, 2లో స్టార్‌లో ఉన్నాయని, అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 3, 4 స్టార్ రేటింగ్ కు తేవాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. పెండింగ్ వర్క్స్ పూర్తిచేయాల్సిన బాధ్యత తమపై ఉందని అన్నారు. ఎక్కడ తరగతి గదుల అవసరం ఉందో అక్కడ యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని నిర్ణయించామని అన్నారు. ఎస్ఎంసీ ఎకౌంట్ లో రూ.200 కోట్ల నిధులు ఉన్నాయని, బడ్జెట్ లో రూ.800 కోట్లు అదనంగా కేటాయించారని అన్నారు. ఈ రెండు కలిపి వచ్చే ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక మౌలిక సదుపాయాలకు రూ.వెయ్యి కోట్లు ఖర్చుచేసే అవకాశం ఉందని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒక పద్ధతి ప్రకారం 5 స్టార్ రేటింగ్ తెచ్చే బాధ్యత ప్రజాప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. 2014-19 నడుమ చేసిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపునకు చర్యలు చేపడతామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ, గత ప్రభుత్వం పాఠశాలల విషయంలో అస్తవ్యస్థ విధానాలు అవలంభించిందని అన్నారు. నాడు- నేడు పేరుతో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. వాటి కారణంగా నేటికి కూడా అనేక చోట్ల అసంపూర్తి నిర్మాణాలు, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తికాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలలో నూతన విద్యావిధానానికి శ్రీకారం చుట్టి, పెద్దఎత్తున ఉపాధ్యాయ పోస్టుల నియామకం చేపట్టినట్లు తెలిపారు.మనబడి - మన భవిష్యత్ పేరిట పాఠశాలలను ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతూ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నారని అన్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య భారీగా పెరుగుతోందని అన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలు, తరగతి గదులను సత్వరం పూర్తిచేయాల్సిందిగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారని అన్నారు.2019 ఎన్నికలకు ముందు తిత్లీ తుపానులో ఎన్నో పాఠశాలలు దెబ్బతిన్నాయని గుర్తు చేశారు. నాటి చంద్రబాబు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేసినప్పటికీ, టీడీపీ సానుభూతిపరులు పనులు చేశారనే కారణంతో వైసీపీ ప్రభుత్వం వాటి బిల్లులు చెల్లించలేదని అన్నారు. గత ఐదేళ్లలో నాడు-నేడు అక్రమాలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అసంపూర్తిగా నిలచిపోయిన భవనాలు పూర్తి చేయాలని గౌతు శిరీష విజ్ఞప్తి చేశారు.

## చదువుతో పాటు ఇవి కూడా ఉండాలి... ఈ మేరకు చంద్రబాబు, లోకేశ్ లను కోరుతున్నాను: నాగబాబు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 17)

విద్యార్థుల్లో పెరుగుతున్న మానసిక ఒత్తిడిని తగ్గించి, వారిని శారీరకంగా దృఢంగా తీర్చిదిద్దేందుకు విద్యా వ్యవస్థలో కీలక మార్పులు తీసుకురావాలని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కోన నాగబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థుల కోసం 'కామన్ ప్లే గ్రౌండ్ సిస్టమ్ (సీజీపీఎస్)' అనే వినూత్న విధానాన్ని ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. ఆటస్థలాలు లేక నాలుగు గోడల మధ్యే చదువుకు అంకితమవుతున్న విద్యార్థుల శ్రేయస్సు కోసం ఈ చర్యలు అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, "పిల్లల్లో ఉండే అపారమైన శక్తిని సరైన మార్గంలోకి మళ్లిస్తే వారు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారు. వారంలో కనీసం మూడు రోజులైనా వారికి ఫిజికల్ ఫిట్‌నెస్, ఆటలు, ఇతర సహ పాఠ్యాంశ కార్యకలాపాల్లో శిక్షణ ఇవ్వాలి. ముఖ్యంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివే పిల్లలు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. దీనివల్ల మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఒత్తిడి తట్టుకోలేక కొందరు ఆత్మహత్యలకు పాల్పడిన విషాద సంఘటనలు కూడా ఉన్నాయి. ఆటలు ఆడటం వలన ఈ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది" అని ఆవేదన వ్యక్తం చేశారు.చాలా ప్రైవేట్ విద్యాసంస్థలకు సొంతంగా ఆటస్థలాలు లేవని, ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం విశాలమైన మైదానాలు అందుబాటులో ఉన్నాయని నాగబాబు గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో "కామన్ ప్లే గ్రౌండ్

## మొదటి పేజీ తరువాయి

సిస్టమ్"ను అమలు చేయాలని సూచించారు. ఈ విధానం ద్వారా జిల్లా పరిషత్, మునిసిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లోని మైదానాలను ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు కూడా ఉపయోగించుకోవచ్చని వివరించారు. దీనికోసం ప్రైవేట్ యాజమాన్యాల నుంచి కనీస రుసుము వసూలు చేయాలని, ఆ మొత్తాన్ని సంబంధిత ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య సిబ్బంది నియామకం, మైదానాల నిర్వహణకు వినియోగించాలని సూచించారు. దీనివల్ల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల మధ్య సత్సంబంధాలు, అవగాహన కూడా పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు.శారీరక దృఢత్వం ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లను ఆయన ఆదర్శంగా చూపారు. "70 ఏళ్ల వయసులో కూడా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఎంతో చురుకుగా ఉన్నారు. ప్రతిరోజూ యోగా చేస్తూ ఉత్సాహంగా పరిపాలన సాగిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారు కీలక శాఖల బాధ్యతలు నిర్వర్తిస్తూనే మార్షల్ ఆర్ట్స్ సాధన కొనసాగిస్తున్నారు. ఇటీవల 'టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్' అనే అంతర్జాతీయ బిరుదు కూడా పొందారు" అని నాగబాబు ప్రశంసించారు.

"ఇనుప కండరాలు, ఉక్కు నరాలు కలిగిన యువత ఈ దేశానికి కావాలి" అన్న స్వామి వివేకానంద మాటలను ఉటంకిస్తూ, మన విద్యార్థులను కేవలం పుస్తకాల పురుగులుగా కాకుండా శారీరకంగా, మానసికంగా బలమైన యువతగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. చదువుతో పాటు ఫిజికల్ ఫిట్‌నెస్, మార్షల్ ఆర్ట్స్, సెల్ఫ్ డిఫెన్స్, యోగా వంటివి పాఠ్యాంశాల్లో భాగం చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ లను సభ ద్వారా కోరుతున్నానని చెబుతూ నాగబాబు తన ప్రసంగాన్ని ముగించారు.

## విశాఖలో రాష్ట్రపతి ముర్ముకు స్వాగతం పలికిన గవర్నర్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి సాదరంగా స్వాగతం పలికారు. ఎంపీ శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాస్, ఉన్నతాధికారులు కూడా రాష్ట్రపతిని ఆహ్వానించిన వారిలో ఉన్నారు.

మంగళవారం (ఫిబ్రవరి 18) విశాఖ తీరంలో జరగనున్న ప్రతిష్ఠాత్మక 'అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష-2026'కు రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. భారత సాయుధ దళాల సుప్రీం కమాండర్‌గా ఆమె ఈ సమీక్షను పర్యవేక్షిస్తారు. ఈ కార్యక్రమంలో భారత నౌకాదళంతో పాటు పలు విదేశీ యుద్ధనౌకలు కూడా పాల్గొంటాయి.

ఈ పర్యటనలో భాగంగా, ఫిబ్రవరి 19న జరిగే 'మిలన్ అంతర్జాతీయ సిటీ పరేడ్', 20న నిర్వహించే 'కాన్‌క్లేవ్ ఆఫ్ చీఫ్స్' కార్యక్రమాల్లో కూడా రాష్ట్రపతి పాల్గొంటారు. ఆమె పర్యటన నేపథ్యంలో విశాఖ నగరంలో పోలీసులు, నౌకాదళ అధికారులు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ అంతర్జాతీయ ఈవెంట్, భారత నౌకాదళ శక్తిసామర్థ్యాలను ప్రదర్శించడంతో పాటు, మిత్రదేశాలతో సంబంధాలను బలోపేతం చేయడానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

## తొలి ట్రిలియనీర్‌గా మస్క్? రికార్డు దిశగా కుబేరుడు

ఇక, మస్క్‌కు టెస్లా లో 12 శాతం వాటా ఉంది. దాని విలువ 178 బిలియన్ డాలర్లుగా ఉంది. కాగా.. ఏడాదిలో ఈ బిలియనీర్.. ట్రిలియనీర్‌గా మారే అవకాశం 75 శాతం ఉందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ఏడాదిలో స్పేస్‌ఎక్స్ ఐపీఓ కు రానుంది. ప్రతిపాదిత ఐపీఓ ద్వారా 25 బిలియన్ డాలర్లను (సుమారు రూ.2.26 లక్షల కోట్లు) సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. అన్నీ అనుకున్నట్టు జరిగితే.. ఆయన నికర విలువ 1.5 ట్రిలియన్ డాలర్లకు కూడా పెరగనుందన్న అంచనాలు ఉన్నాయి.

## సామాజిక మాధ్యమాల వినియోగంపై వయసుల వారీ పరిమితులు

ఆధారిత సోషల్ మీడియా అందుబాటు వ్యవస్థను ప్రవేశపెట్టాలని అభిప్రాయపడింది. పలువురు ఎంపీలు సైతం ఈ అంశాన్ని లేవనెత్తారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చొరవ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ అంశం సంప్రదింపుల దశలో ఉంది.

## ఏపీలో టెక్ పాలన అమోఘం... సోషల్ మీడియాలోనూ ఆశ్చర్యం వ్యక్తం చేసిన బిల్ గేట్స్!

తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆరోగ్యం, వ్యవసాయం, విద్య వంటి రంగాల్లో సాంకేతికత, ఏఐ ఆధారిత ఆవిష్కరణల వినియోగంపై ఇరువురు నేతలు చర్చించారు. 1990లలో గేట్స్‌తో జరిగిన తొలి సమావేశమే తనకు స్ఫూర్తినిచ్చిందని, ఇప్పుడు ఏపీలో టెక్నాలజీతో సాగుతున్న పాలనను ఆయనకు చూపించడం సంతోషంగా ఉందని చంద్రబాబు ఎక్స్ వేదికగా తెలిపారు.

ఈ పర్యటనలో భాగంగా గేట్స్ ఉండవల్లిలో అరటి తోటను సందర్శించి, సహజ వ్యవసాయ పద్ధతులను పరిశీలించారు. ఢిల్లీలో జరగనున్న ఏఐ సమ్మిట్‌కు వెళ్లే ముందు ఆయన ఏపీకి వచ్చారు. ఈ పర్యటనతో రాష్ట్రంలో ఆరోగ్యం, వ్యవసాయ రంగాల్లో పలు ప్రాజెక్టులకు మద్దతిస్తున్న గేట్స్ ఫౌండేషన్‌తో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యం మరింత బలోపేతం కానుంది.

## చంద్రబాబుతో ఉంటే బిల్ గేట్స్‌ను కలుస్తారు... జగన్‌ను నమ్ముకుంటే గేటు బయటే ఉంటారు: మంత్రి పార్థసారథి

ఈ రెండు చిత్రాలను పోలుస్తూ ఆయన పైవిధంగా వ్యాఖ్యానించారు.

సోమవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో బిల్ గేట్స్ సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు మంత్రి పార్థసారథి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిల్ గేట్స్ మాట్లాడుతూ, భారతదేశ డిజిటల్ విప్లవంలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు.ముఖ్యంగా డిజిటల్ గవర్నెన్స్, విపత్తుల నిర్వహణలో టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించడంలో చంద్రబాబు చేస్తున్న కృషిని బిల్ గేట్స్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కీలక సమావేశం జరిగిన నేపథ్యంలోనే మంత్రి పార్థసారథి చేసిన పోస్ట్ రాజకీయంగా చర్చనీయాంశమైంది.

## వైసీపీ నేతల్లారా... సిగ్గుపడండి! మండలిలో అచ్చెన్నాయుడు ఫైర్

చేసిన వైసీపీకి ధర్మం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. ఈ సందర్భంగా గతంలో జగన్ తిరుమల పర్యటనను మంత్రి గుర్తుచేశారు. హిందూ సంప్రదాయాల ప్రకారం డిక్లరేషన్ ఇవ్వడానికి జగన్ ఎందుకు భయపడ్డారని ప్రశ్నించారు.అంతేకాకుండా, హెరిటేజ్ సంస్థపై అడ్డగోలు ఆరోపణలు చేయడం మానుకోవాలని, దమ్ముంటే కనీసం ఒక్క ఆధారమైనా చూపాలని వైసీపీకి సవాల్ విసిరారు. వ్యవస్థలను భ్రష్టు పట్టించి, హిందూ ధర్మంపై దాడులకు పాల్పడిన ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని అచ్చెన్నాయుడు హెచ్చరించారు. సత్యం గెలిచి తీరుతుందని, తప్పు చేసిన వారు తప్పకుండా శిక్ష అనుభవిస్తారని ఆయన స్పష్టం చేశారు.

## ఏఐ ఇంపాక్ట్ సదస్సుకు బిల్‌గేట్స్ దూరం.. ఎప్‌స్టీన్ వ్యవహారమే కారణమా..?

విడుదల చేసిన సంగతి తెలిసిందే. 30 లక్షల 'ఎప్‌స్టీన్' పేజీలను బయటపెట్టింది. వీటితో పాటు 2,000 వీడియోలు, 1,80,000 ఫొటోలనూ విడుదల చేసింది. ఎప్‌స్టీన్ ఫైల్స్ ట్రాన్స్‌పరెన్సీ చట్టం కింద అమెరికా న్యాయశాఖ వెబ్‌సైట్‌లో ఈ పత్రాలు, వీడియోలు, ఫొటోలు అందుబాటులో ఉంచింది. జైల్లో చనిపోయిన మిలియనీర్ ఫైనాన్షియర్ ఎప్‌స్టీన్ ఆధ్వర్యంలో మైనరు బాలికలపై జరిగిన లైంగిక వేధింపులకు సంబంధించిన వివరాలు అందులో ఉన్నాయి. అతడు ట్రంప్, బిల్ క్లింటన్, ఎలాన్ మస్క్, బ్రిటన్ మాజీ యువరాజు ఆండ్రూలతో జరిపిన సంభాషణలు ఉన్నాయి. గేట్స్ పై ఎప్‌స్టీన్ చేసిన ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. అయితే వాటిని ఆయన బృందం ఖండించిన సంగతి తెలిసిందే.

### గేట్స్ ఫౌండేషన్ ఏం చెప్పిందంటే..?

"బిల్‌గేట్స్ ఏఐ ఇంపాక్ట్ సదస్సుకు హాజరవుతారు. అక్కడ షెడ్యూల్ ప్రకారం ఉపన్యసిస్తారు" అని గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధి జాతీయ మీడియాతో వెల్లడించారు. ఈ కథనాలపై ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత రావాల్సిఉంది.

## తౌషిక్ మరణం పై త్రీ మెన్ విచారణ కమిటీని నియమించిన జిల్లా కలెక్టర్

దళిత నేత నీలం నాగేంద్ర

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17)



సింగరాయకొండ చైతన్య నవోదయ స్కూల్ లో సైయద్ తౌషిక్ మరణించిన ఘటనపై దళిత సంఘాల ఆందోళనతో జిల్లా కలెక్టర్ రాజబాబు విచారణ కమిటీని నియమించారు. శనివారం శింగరాయకొండలోని శ్రీ చైతన్య నవోదయ స్కూల్ లో ఆరోతరగతి చదువుతున్న సైయద్ తౌషిక్ అను విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు అని స్కూల్ వార్డెన్ తలితండ్రులకు ఫోన్ చేసి చెప్పారు. కనిగిరిలో నివసిస్తున్న తౌషిక్ తల్లితండ్రులు హుటాహుటిన శింగరాయకొండ వచ్చి తమ కొడుకు సవపరిస్థితినిబట్టి ఆందోళన వ్యక్తం చేశారు .11 సంవత్సరాల తమ కొడుకుది ఆత్మహత్య కాదు అని స్కూల్ వార్డెన్ బాబ్జి , ప్రిన్సిపాల్ చైతన్య రెడ్డి , మేనేజ్మెంట్ రమణా రెడ్డి లే తమ కొడుకు మరణానికి కారకులు అని ఆందోళన చేశారు. సింగరాయకొండ పోలీస్ స్టేషన్ లోకూడా పైవిధంగా ఫిర్యాదు చేశారు. కానీ సింగరాయకొండ యస్ఐ మహేంద్ర, సిఐ హాజరత్తయ్యలు మీ కేస్ మేము తీసుకోము అని మీకు దిక్కున్న చోట చెప్పుకోమని తమను ఒంగోలు గవర్నమెంట్ హాస్పిటల్ పోస్ట్ మార్టం రూమ్ వద్ద బెదిరించారు అని అన్నారు. పోస్ట్‌మార్టం డాక్టర్లని కూడా సింగరాయకొండ యస్ ఐ మహేంద్ర ఫోన్లో మాట్లాడరని డాక్టర్ ఇచ్చే పోస్ట్‌మార్టం రిపోర్ట్ మీద కూడా తమకు నమ్మకం లేదు అని సోమవారం కలెక్టరేట్ ముందు తౌషిక్ బంధువులు ఆందోళన నిర్వహించారు. రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించిన ప్రభుత్వ అధికారులు పట్టించుకోవపోవటంతో దళితనేత నీలం నాగేంద్రం జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసుకు, ఒంగోలు డిస్పీ రాయపాటి శ్రీనివాసరావుకు ఫోన్ చేసి బాధితులు వద్దకు పిలిపించారు. తరువాత కలెక్టరేట్‌లో జరిగిన చర్చల్లో తౌషిక్ కేస్ నుండి విచారణ అధికారిగా సింగరాయకొండ యస్ఐ మహేంద్రను తప్పించి వేరే యస్ఐని నియమిస్తామని ఒంగోలు డీస్పీ రాయపాటి శ్రీనివాసరావు తెలిపారు. అంతట దళిత నేత నీలం నాగేంద్రం పోలీస్ విచారణ పై తమకు నమ్మకం లేనందున ప్రత్యామ్న్యాయంగా విచారణ కమిటీని నియమించాలని ఓబులేసుని కోరగా దళిత నేత నీలం నాగేంద్రరావు కోరిన మేరకు జిల్లా కలెక్టర్ రాజబాబు, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శింగరాయకొండ తసీల్దార్లతో త్రీ మెన్ కమిటీని నియమించారు. నాలుగు రోజుల్లో రిపోర్ట్ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ త్రీ మెన్ కమిటీని ఆదేశించారని దళిత నేత నీలం నాగేంద్రం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.





## అంగరంగ వైభవంగా భద్రకాళి సమేత వీరభద్రుని కళ్యాణ మహోత్సవం

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఫిబ్రవరి 17)





మండల కేంద్రమైనతర్లుపాడు గ్రామంలో వెంచేసి యున్న శ్రీ భద్రాకాళి సమేత శ్రీ వీరభద్రుని ఆలయంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ నేరెళ్ల సాంబశివరావు ఆధ్వర్యంలో స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఉభయ దాతలుగా నేరెళ్ల కుమార్ దంపతులు, నేరెళ్ల కార్తీక్ దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. స్వామి వారి కళ్యాణం వేదపండితులైన ఓరుగంటి శ్రీరామ శర్మ, ఓరుగంటి పవన్ కుమార్ శర్మ, రంగానాదశర్మ, ఆర్ఎస్ శర్మ, కృష్ణశర్మ, భార్గవ్‌శర్మ మంత్రోచ్చారణ నడుమ శాస్త్ర యుక్తంగా భద్రకాళీ, వీరభద్రస్వామి వారి ప్రాశస్త్యాన్ని వేద పండితులు భక్తులకు అర్థవంతంగా వివరించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలకు గ్రామం నుండి మహిళలు తరలి వచ్చిన భక్తులతో ఆలయమంతా కిక్కిరిసిపోయింది. కళ్యాణానంతరం ఆలయంలోని భక్తులకు ప్రసాద వితరణతో పాటు అన్నప్రసాద కార్యక్రమాలు కూడా ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ దేవతా మూర్తుల అర్చకులు కల్యాణ ఘట్టం పూర్తి చేశారు. దీంతో భక్తులు అపూర్వ ఘట్టాన్ని దర్శించుకుని భక్తిపరవసులై పులకరించిపోయారు. ఈ కార్యక్మంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, అనువంశిక ధర్మకర్త జవ్వాజి విజయ భాస్కరరావు, వీరభద్ర స్వాముల వారి ఆలయ ట్రస్ట్ చైర్మన్ నేరెళ్ల సాంబశివరావు, నేరెళ్ల మల్లికార్జునరావు, నేరెళ్ల కుమార్, నేరెళ్ల కార్తీక్, గ్రామస్థులు పోలేపల్లి జనార్దన్‌రావు, వాడేల కృష్ణప్రసాద్, కోలగట్ల భాస్కరరెడ్డి, కోలగట్ల కాశీశ్వరరెడ్డి, కుందురు చిన్నకాశిరెడ్డి, ఈర్ల వెంకటయ్య, వెలుగు కాశీరావు, కాళంగి శ్రీనివాసులు, వెన్నా రాజారామిరెడ్డి, బేదుదూరి పుల్లయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు కొలగట్ల నారాయణరెడ్డి, జవ్వాజి వెంకటేశ్వర్లు, చినమనగొండ సుబ్రహ్మణ్యం, దోగిపర్తి మల్లికార్జునరావు, దోగిపర్తి హరిబాబు, నేరెళ్ల జనార్దన్‌రావు, తదితరులు మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం గ్రామ పురవీధులలో స్వామి వారి గ్రామోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

## జెఇఇ మెయిన్స్ పరీక్ష ఫలలితాలలో మెరిసిన ఒంగోలు నారాయణ విద్యార్థులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17)




సోమవారం విడుదలైన జెఇఇ మెయిన్స్ పరీక్షా ఫలితాలలో ఒంగోలు నారాయణ విద్యా సంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపర్చి, మంచి ఫలితాలు సాధించినట్లు మంగళవారం ఒంగోలు నారాయణ సరస్వతీ భవన్‌లో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో ప్రకాశం జిల్లా నారాయణ విద్యా సంస్థల కొర్ డీన్ ఆర్ మధుసూధన్‌రెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు ఆర్ ఆశిష్ పాల్‌రెడ్డి 98.862, ఇ రోహిత్ నరసింహ 94.78, కె.రోహిత్ 94.58, దేవకి నందన్ 94.35, ఎన్.యశశ్విని 92.25, నీలమేఘ 91.48 పర్సన్ టైల్ సాధించినట్లు మధుసూధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇంతేకాకుండా మరో 20 మంది విద్యార్థులు వివిధ కేటగిరీలలో ప్రతిభ కనపర్చినట్లు వారు తెలిపారు. సమావేశంలో సంస్థల ఏజిఎం మురళి మాట్లాడుతూ పోటీ పరీక్షలు ఏవైనా ఎక్కడైనా, ఎప్పుడైనా నారాయణ విద్యార్థులదే అగ్రస్థానంలో ఉంటారని ఆయన అంటూ, ఈ పరీక్షల ఫలితాలు అందుకు నిదర్శనం అన్నారు. సమావేశంలో సరస్వతీ భవన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, కోర్ట్ సెంటర్ ప్రిన్సిపాల్ ఎన్ సుజాత, అధ్యాపకులు పాల్గొని, విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు.


ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక


17.02.26 బుధవారం


## కూటమి ప్రభుత్వం ఆక్వా రైతులకు అండగా నిలుస్తోంది

### ఆక్వా రైతులకు యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్

### యూనిట్‌కు రూ.2.35 సబ్సిడీని కూటమి ప్రభుత్వం భరిస్తోంది

### విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్



(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఫిబ్రవరి 17)

తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వం ఆక్వా రైతులకు ఎల్లవేళలా అండగా నిలుస్తోందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఆక్వా రైతులకు ఒకే రకమైన విద్యుత్ సబ్సిడీ అమలుపై అసెంబ్లీలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అడిగిన ప్రశ్నకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమగ్ర సమాధానం ఇచ్చారు. మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆక్వాకల్చర్‌కు విద్యుత్ సబ్సిడీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. ఆక్వాకు సంబంధించి జోన్, నాన్ జోన్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను ఫిషరీస్ శాఖ సమగ్రంగా నిర్వహించిందని స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి లోపాలు లేవని స్పష్టం చేశారు. ఏపీఈఆర్సీ ఆదేశాల ప్రకారం ఆక్వాకల్చర్‌కు యూనిట్‌కు రూ. 3.85 వసూలు చేయాల్సి ఉన్నప్పటికీ ఆక్వా రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం రూ. 2.35 సబ్సిడీ భారం భరిస్తూ యూనిట్‌ను కేవలం రూ. 1.50 కే అందిస్తున్నదని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో (తరువాయి 4లో...)

# దగాపడ్డ రాష్ట్రానికి దశా దిశను చూపే బడ్జెట్

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఫిబ్రవరి 17)

దగాపడ్డ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దశా దిశా చూపి, ఐదు కోట్ల ఆంధ్రుల ప్రజల ఆశల ఆకాంక్షలను ఆవిష్కరించే దార్శనిక నేత చంద్రబాబు ఉక్కు సంకల్పానికి ప్రత్యేకంగా నిలిచే భవిష్యత్తు మార్గదర్శిని ఏపీ బడ్జెట్ అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీ వేదికగా బడ్జెట్ పై సుదీర్ఘంగా ప్రసంగించారు. గత వైసిపి ప్రభుత్వం తప్పిదాలను ఎత్తిచూపి భవిష్యత్తు తరాల ఆశాజ్యోతి సీఎం చంద్రబాబు ఆలోచనలు, సమర్థత, పారదర్శకత, అభివృద్ధి విజన్ ను వివరించారు. గత వైసిపి ప్రభుత్వ అహంకారం, అధికార దుర్వినియోగం, స్వార్థం, బాధ్యతరాహిత్యం, అసమర్థతను సభ సాక్షిగా కళ్ళకు కట్టినట్లు చూపారు.

**ఎమ్మెల్యే ఏలూరి మాటల్లో ఇలా...**

2026–27 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జరిగిన చర్చ సందర్భంగా సభ్యులు ప్రభుత్వ దిశా నిర్దేశక ఆలోచనను ప్రశంసించారు. బడ్జెట్‌పై మాట్లాడే అవకాశం కల్పించిన స్పీకర్ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. బడ్జెట్ కేవలం ఆదాయం–వ్యయాల లెక్కల సమాహారం మాత్రమే కాదని, ప్రభుత్వ ఆలోచన దిశానిర్దేశ పత్రం అని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత,అభివృద్ధి లక్ష్యాలు, పారదర్శకతను ఈ బడ్జెట్ స్పష్టంగా ప్రతిబింబిస్తోందని అభిప్రాయపడ్డారు.

**దగా పడిన రాష్ట్రానికి అండగా సిబిఎన్ బ్రాండ్....**

అంకెల వెనుక ఒక ఆలోచన ఉందని... ఆలోచనకు ఒక దూరదృష్టి ఉంది... ఆ దూరదృష్టి వెనక ఒక నాయకత్వం ఉందని ఆ నాయకత్వానికి ఒక రూపం ఉందని ఆ రూపానికి ..ఒక బ్రాండ్ ఉందని అదే సీబీయన్ అన్నారు. గతంలో జరిగిన తప్పులను సరిచేయడమే కాదు భవిష్యత్తు నిర్మాణానికి పునాదిగా ఈ బడ్జెట్ ఉందని వెల్లడించారు. 30 ఏళ్ళు ముఖ్యమంత్రి చంద్రబాబుతో దగ్గరగా పనిచేసిన అనుభవంతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఈ బడ్జెట్ రూప కల్పనలో ఆయన ఆలోచనలు తగ్గట్టుగా ..లోకేష్ బాబు ఎంచుకున్న లక్ష్యాలకు తగ్గట్టుగా...పవన్ కళ్యాణ్ ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ ఉందన్నారు. ఎలాంటి పరిస్థితిలో ఈ బడ్జెట్ ప్రవేశపెట్టామో ఒకసారి గతాన్ని నెమరవేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**విభజన గాయాలు వైసిపి దుర్మార్గపు పాలన....**

కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి విభజన గాయాలు ఒకవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిపాలన రెండో దెబ్బగా వర్ణించారు. అహంకారంతో అధికార దుర్వినియోగం స్వార్థ ప్రయోజనాలు బాధ్యత రాహిత్యం అసమర్థతే పెట్టుబడిగా కేవలం వ్యక్తి స్వార్థం కోసం ప్రభుత్వ ఖజానాను సొంత జేబు సంస్థ లాగా నడిపిన గత ప్రభుత్వ దుర్మార్గాలు సందర్భంగా గుర్తుపెట్టుకోవాలన్నారు. ఆరోజు రాష్ట్రంలోని 8 లక్షల మంది ఉద్యోగులకు ఎప్పుడు జీతం పడుతుందో తెలియని పరిస్థితి...ఒకటో తేదీన గత ఐదేళ్ల జీతం

**ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు**

**దూరదృష్టి సమర్థ నాయకత్వానికి బ్రాండ్ "సిబిఎన్"**

**భవిష్యత్తు నిర్మాణానికి నిజమైన నాయకత్వం**

**క్రమశిక్షణతో అభివృద్ధి, బాధ్యతతో సంక్షేమం**

**పర్చూరు, చీరాలను పూర్వోదయలో చేర్చండి**

**స్కిన్ డెవలప్మెంట్‌కు నిధులు కేటాయించాలి**

**వైసిపి తప్పుడు ప్రచారాలను బహిర్గతం చేయాలి**

**చంద్రబాబు పాలన పారదర్శకతకు పునాది**



పడిన దాఖలను లేవన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. అలాగే పది లక్షల కోట్లుకు పైగా కొత్త అప్పులు తెచ్చారు...అధిక వడ్డీలకి డబ్బులు తీసుకువచ్చారు... ఎక్కడ ఫైనాన్షియల్ రెస్పాన్సిబిలిటీ లేకుండా బాధ్యత రాహిత్యంగా వ్యవహరించారని ఇప్పుడు ఆ ఈఎంఐలు పెద్ద ఎత్తున కట్టాల్సి వస్తుందన్నారు. ఏ ప్రభుత్వ ఆసుపత్రిలో,వెటర్నరీ హాస్పిటల్ లో మందులు దొరికేవి కాదన్నారు. రైతాంగానికి ఏ విధమైన పనిముట్లు అందించే పరిస్థితి లేదని ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లింపులు లేవు, విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్లు , ఫీజు రియంబర్స్మెంట్ సమయానికి చెల్లించలేదన్నారు. పంచాయతీ మున్సిపాలిటీ నిధులను,యూనివర్సిటీ డిపాజిట్స్ కూడా ప్రభుత్వ ఖజానాకు మళ్ళించారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారని పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయం, కేంద్ర సహకారం కొన్ని పరిమితులు ఉన్నాయని అయినా ఉన్న అతి తక్కువ వనరులను ఉపయోగించుకుని గత తప్పులను సరి చేసుకుంటూ భవిష్యత్తుకు మంచి బాటలు వేసేలా ఈ బడ్జెట్ రూపకల్పన జరిగిందన్నారు.

**వారసత్వంగా బకాయిలు....**

గత వైసీపీ ప్రభుత్వ బకాయిలు ఈ ప్రభుత్వానికి వారసత్వంగా వచ్చాయని రూ.3 లక్షల కోట్లలో ప్రభుత్వ చెల్లించాల్సిన బిల్లులు ఎన్‌ఆర్‌ఈజీఎస్, కాంట్రాక్టర్ బిల్లులు, కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులు ఇతర పథకాలకు వాడినవి చెల్లించాల్సిన 70, 80 వేల కోట్లు ఇలా మొత్తం కలుపుకొని 10 లక్షల కోట్ల అప్పులు,రూ. 3 లక్షల కోట్ల బకాయిలు, ఈ పరిస్థితులలో ప్రతి ఏడాది 35 వేల నుంచి 40,000 వేల కోట్లు ఈఎంఐలు వడ్డీతో సహా చెల్లిస్తున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. స్టేట్ ఓన్ టాక్స్ 1,25 వేల కోట్లు, సెంట్రల్ టాక్స్ కింద రాష్ట్ర వాటా 64 వేల కోట్లు, గ్రాంట్ నెట్ కింద 32 వేల కోట్లు, మొత్తం నాన్ టాక్స్ రెవెన్యూ కింద 11వేల కోట్లు, మొత్తం కలిపి 2,34,148 కోట్ల రెవెన్యూ ఆదాయంగా ఉందన్నారు. రెవెన్యూ వ్యయం 2,56,142 కోట్లు ఉంది. రెవెన్యూ లోటు రూ. 22,000 కోట్లు ఉందో జి ఎస్ డి పి 1.1 % శాతానికి తక్కువగా ఉందన్నారు. రాష్ట్రం జి ఎస్ డి పి 20 లక్షల కోట్ల రూపాయలకు చెరువగా ఉందని అంచనా వేసి ప్రభుత్వం ఆ దిశగా పనిచేస్తుందన్నారు. 2047 కి 300 లక్షల కోట్ల రూపాయలు జి ఎస్డిపి చేరాలని లక్ష్యంగా వేసిన మొదటి అడుగ్గా ఈ బడ్జెట్ను చూడాలన్నారు.

**బడ్జెట్ రూప కల్పనలో ఐదు ప్రిన్సిపుల్స్...**

ఆర్థిక క్రమశిక్షణ , సామాజిక బాధ్యత, క్యాపిటల్ ఎక్స్పెండిచర్, సమగ్రాభివృద్ధి, పారదర్శకత కనిపిస్తుందన్నారు. ఆదాయానికి మించిన ఖర్చులను నియంత్రణ చేయడం, తెచ్చే అప్పులకు బాధ్యతాయుతమైన ఆదాయ వనరులను సృష్టించడం, అప్పులను తిరిగి చెల్లించేలా ప్రణాళికలు రూపొందించడం, రెవెన్యూ, ఆర్థిక లోటులను తగ్గించుకుంటూ ప్రభుత్వ రోజువారి ఖర్చులకు అప్పులు చేయకుండా స్థిరమైన ఆర్థిక పరిస్థితి ప్రభుత్వానికి ఉండాలని బడ్జెట్ రూపకల్పన చేశారన్నారు. సామాజిక బాధ్యతగా ప్రభుత్వం నిర్వహించే సంక్షేమ పథకాలకు సామాజిక పెట్టుబడిగా ఈ ప్రభుత్వం చూస్తున్నారు.

**మూలధనం వ్యయంతో పెట్టుబడులు...**

క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్ ద్వారా ఆస్తులను క్రియేట్ చేయడం, మెరుగైన సౌకర్యాలను ప్రజలకు అందించడంతోపాటు ఆదాయాన్ని పెంపొందిస్తూ, ఉపాధి అవకాశాలు కల్పించేలా 48 వేల కోట్లు ఖర్చు పెట్టాలని ప్రణాళికలు రచించినట్లు వెల్లడించారు. 202–23లో గత వైసిపి ప్రభుత్వం అస్తవ్యస్త ఆర్థిక విధానాలు ప్రణాళిక బద్ధంగా పనిచేయకపోవడం ద్వారా కనీసం పదివేల కోట్ల కూడా మూలధనం వ్యయం కింద వైసిపి ప్రభుత్వం ఖర్చు పెట్టలేకపోయారని పేర్కొన్నారు. కానీ ఈరోజు అనుకొన్న స్థాయిలో ఆదాయం లేకపోయినా (తరువాయి 4లో...)

## చంద్రన్న మార్కాపురం జిల్లాగా పేరు పెట్టుకుంటాం

### సభ్యులందరూ ముఖ్యమంత్రిని ఒప్పించాలి

### అసెంబ్లీలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 17)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో సుదీర్ఘంగా మాట్లాడారు. మొదటిగా మార్కాపురం జిల్లా ప్రకటించినందుకు నూతన జిల్లాకు చంద్రన్న మార్కాపురం జిల్లాగా పేరు పెట్టుకుంటామని దయచేసి అసెంబ్లీ సభ్యులందరూ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుని దానికి ఒప్పించాలని సభ్యులను సభా సాక్షిగా కోరారు. అనంతరం రైతులు గత వైసీపీ పాలకుల హయాంలో దగాపడ్డారని దానిని గణాంకాలతో సహా అసెంబ్లీలో ప్రస్తావించారు. వెలుగొండ ప్రాజెక్టును గత వైసీపీ పాలకులు పూర్తికాకుండానే ప్రాజెక్టును జాతికి అంకితం చేసి వెళ్ళిపోయి ఈ ప్రాంత ప్రజలను నిలువునా మోసం చేశారని అదే ఈ ప్రభుత్వ హయాంలో ఒక నెలలోనే రాష్ట్ర నిటిపారుదల శాఖ మంత్రి నాలుగుసార్లు సందర్శించడం చరిత్రలో ఎప్పుడు జరగలేదని, దీని ద్వారా ఈ వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రభుత్వం ఎంత కృత నిశ్చయంతో ఉందో తెలుస్తుందని అన్నారు. (తరువాయి 4లో...)

## ఉగాది నాటికి నిర్దేశించిన లక్ష్యం మేరకు గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17)

ఉగాది నాటికి నిర్దేశించిన లక్ష్యం మేరకు గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన ప్రకాశం భవనం నుంచి మున్సిపల్ కమిషనర్లు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హౌసింగ్, సచివాలయాల సేవలు, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, పారిశుద్ధ్యము, స్వమిత్వ సర్వే, ఇంటి పన్నుల వసూలు, అక్షర ఆంధ్ర, విద్యా, వైద్యం, డ్వామా, పంచాయతీరాజ్ పనులపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జన్మన్, పి.ఎం.ఏ.వై.–2.0 పథకం కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాలలో కూడా వేగం పెంచాలని స్పష్టం చేశారు. సచివాలయాల సిబ్బందితో చేయిస్తున్న సర్వేలను కూడా ఈ నెలాఖరు నాటికి ముగించాలన్నారు. ఇంటి పన్నుల వసూలులో లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు హెల్త్ చెకప్స్ చేయాలని, వారిని పబ్లిక్ పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసేలా ఎంఈఓలు తమ పరిధిలోని పాఠశాలలను రెగ్యులర్గా సందర్శించాలని ఆయన చెప్పారు. అక్షర ఆంధ్ర కార్యక్రమంపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించిన నిధులను సమర్థంగా వినియోగించుకునేలా పెండింగ్ పనులను పూర్తి చేయాలని పంచాయతీరాజ్, డ్వామా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ హౌసింగ్ పిడి శ్రీనివాస ప్రసాద్, జడ్పీ సీఈవో చిరంజీవి, డిపిఓ వెంకటేశ్వరరావు, డీఈవో రేణుక, ఆర్.ఐ.ఓ. ఆంజనేయులు, డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, డ్వామా పీ.డీ. జోసఫ్ కుమార్, పంచాయతీరాజ్ ఎస్.ఈ. అశోక్, డిఆర్డిఏ పిడి నారాయణ, సిపిఓ సుధాకర్ రెడ్డి, సచివాలయాల నోడల్ ఆఫీసర్ సువార్తమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు. (తరువాయి 4లో...)

## భూములకు క్లియరెన్స్ ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేస్తాం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17)



జిల్లాలో ఐరన్ ఓర్, ఇతర ఖనిజాలను వెలికి తీసేందుకు ముందుకు వచ్చే కంపెనీలకు అవసరమైన భూములకు క్లియరెన్స్ ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేస్తామని కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, జిల్లా అటవీ అధికారి ( టెరిటోరియల్ ) వినోద్ కుమార్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఖనిజాలు ఉన్న భూములు రెవెన్యూ, అటవీ శాఖల పరిధిలో ఉన్నందున, కొన్నిచోట్ల సరిహద్దు పై స్పష్టత లేనందున జాయింట్ సర్వే చేయిస్తామని కలెక్టర్ తెలిపారు. ఖనిజాలు ఉన్న భూములను అటవీ శాఖ నుంచి తీసుకోవాల్సి వస్తే ఆ మోతాదుకు తగినట్లుగా అడవులు పెంచేందుకు నష్టపరిహార భూములను కూడా అటవీ శాఖకు ఇస్తామన్నారు. అనంతరం గనులు, అటవీ శాఖ అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ దిశగా ప్రతిపాదనలు రూపొందించాలని వారికి చెప్పారు.

## తన ఇంటిని లాక్కొని రోడ్డున పడేశారు

### జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన వృద్ధుడు యేసయ్య

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 17)



మార్కాపురం జిల్లా కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో హనుమంతునిపాడు మండలం హనుమంతపురం గ్రామానికి చెందిన 73 సంవత్సరాలు గలిగిన వృద్ధుడు తలారి ఏసయ్య తన ఇంటిని లాక్కొని వీధిన గెంటివేశారని జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాస్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అనారోగ్య సమయంలో మతిస్థిమితం లేనప్పుడు తన బంధువులు వేలిముద్రలు వేయించుకొని తన ఇంటిని కాజేశారన్నారు. అనంతరం తన ఇంటిని వేరే వారికి విక్రయించడంతో వారు తన ఇంటి మీదికి వచ్చి దౌర్జన్యంగా బెదిరిస్తూ ఇంటిని ఖాళీ చేయాలని ఇంట్లో ఉన్న వస్తువులను రోడ్డు మీద పడవేశారన్నారు. తనకు ఎవరూ లేరని తల దాచుకుంటున్న ఇంటిని కూడా బంధువులు అత్యాశతో అక్రమంగా ఇతరులతో కలిసి నాకు అన్యాయం చేశారని ఆరోపించారు. సంబంధిత అధికారులు తనకు నీడనిచ్చే తన ఇంటిని ఇతరుల చెర నుండి విడిపించి తనకు న్యాయం చేయాలని వృద్ధుడు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులను కోరారు.

# దగాపడ్డ రాష్ట్రానికి దశా దిశను చూపే బడ్జెట్

సుమారు 50 వేల కోట్లు మూలధనం కింద ప్రభుత్వం ఖర్చు చేసేందుకు ప్రయత్నించడమే ఈ ప్రభుత్వ విజన్ అన్నారు.

**పారదర్శక పాలనపై దృష్టి...**

రాష్ట్రంలో స్పష్టమైన బడ్జెట్ వివరాలతో పాటు ప్రతి రూపాయి ఖర్చుపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగుతోందని, గతంలో జఖీమీా ఉండేది దానిని వైసిపి ప్రస్తుతం తొలగించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పీ ఎఫ్ ఎం ఎస్ ను ప్రవేశపెట్టిందన్నారు.

**ఆరోపణలను తిప్పి కొట్టాలి....**

ప్రణాళికలు తయారు చేయడం అమలు దిశగా పనిచేయటం ప్రతిపక్షాల ఆరోపణలను సరైన సమయంలో తిప్పికొట్టకపోతే నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగుల సాధనలో భాగంగా దాదాపు 20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. యువ నేత లోకేష్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రి సహాయ సహకారాలతో పనిచేస్తున్నారని కానీ వైఎస్ఆర్సిపి చేసే ఆరోపణలను తిప్పి కొట్టాలన్నారు. ప్రభుత్వం ఇన్కమ్ లెస్ గ్రోత్ చూపిస్తుందని వైసిపి పార్టీ తప్పుడు ఆరోపణ చేస్తుందని, రాష్ట్రంలో పన్ను రాబడి 2024-25 లో 89 వేల కోట్లు ఉంటే ప్రస్తుతం కోటి 25 లక్షల 40 శాతం గత రెండు సంవత్సరాలలో పెరిగిందన్నారు. రాష్ట్ర ఆదాయం జీఎస్టీ చెల్లింపులు, వ్యాపార లావాదేవీలు ద్వారా మాత్రమే రాష్ట్ర ఆదాయం పెరుగుతుందని, అది కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తుందన్నారు. మూలధనం వ్యయం గతంలో రూ.16 వేల కోట్ల నుంచి రూ. 48 వేల కోట్లకు పెంచడం జరిగిందని దాదాపు మూడు రేట్లు పెరిగిందన్నారు. మూలధనం వ్యయం భవిష్యత్తులో ఉపయోగపడుతుందన్నారు.

**బడ్జెట్ గత ఆర్థిక మంత్రి బుగ్గన...ప్రవచనాలపై నిజాలు**

గత ఆర్థిక మంత్రి బుగ్గన ...వాళ్ళ నాయకుడు జగన్మోహన్ రెడ్డి మెప్పు పొందేందుకు బడ్జెట్పై రకరకాల కట్టుకథలు అల్లారు."సాక్షి" పత్రికలో ప్రచారం చేశారు. కాగ్ నివేదికలు, ఆడిటింగ్ ఏజెన్సీలు ఇచ్చే, రికార్డులను తారుమారు చేసి అసత్యాలను సత్యాలుగా ప్రజలను తప్పుదారి పట్టించేలా పూనుకున్నారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంపై ఆరోపణలు చేసేందుకు కుయుక్తులు పన్నారని మండిపడ్డారు.

**వృద్ధి రేట్లలో తారుమార్లు-అసలు నిజాలు**

2018-19 వృద్ధి రేటును15.3 ఉంటే చివరలో 11.14 రివైజ్ అయిందని అది చెప్పకుండా 22లో ఉన్న రాష్ట్రాన్ని 4 స్థానానికి తీసుకొచ్చామని గొప్పలు చెప్పారు.వాస్తవంగా ఆరోజు వారు ఎంతకు బరితెగించారంటే రీకార్డులను ట్యాంపర్ చేసి ప్రభుత్వ కాగ్ లెక్కలను తారుమారు చేశారన్నారు.2019-20లో 12.73 శాతం ఎస్టిమేషన్ ఉంటే థర్డ్ రివైజ్డ్ 5.97 శాతం అని కేంద్రం, రాష్ట్ర గణాంకాలు తేల్చాయన్నారు. వారి తప్పులను కప్పిపుచ్చుకునేందుకు 2018-19 లో సాధించిన వృద్ధి రేటును 2019-20లో చూపించి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని పేర్కొన్నారు. దాదాపు 10 లక్షల కోట్లు మా ప్రభుత్వం అప్పు చేసిందని ఎన్నికల ముందు చెప్పారని తర్వాత బడ్జెట్లో పొందుపరచలేదని చెప్పారు ఇది పూర్తిగా సత్య దూరం అన్నారు. 2022-23 కాగ్ రిపోర్టులో స్టేట్ ఫైనాన్స్ ఆడిట్ రిపోర్ట్ లో పేజీ నెంబర్ 66లో స్పష్టంగా అప్పటివరకు 2018-19 రూ.1,83,2745 కోట్లు అప్పు ఉందని, 2022-23 రూ. 3,37,530 కోట్లు అప్పు ఉందని, బడ్జెట్లో చూపించిన అప్పు అన్నారు. బడ్జెట్లో కాకుండా ఆఫ్ బడ్జెట్ బోర్రోవింగ్స్ వైసీపీ ప్రభుత్వ హయాంలో 2019-20 రూ.77,586 కోట్లు, 2020-21రూ. 1,12,115 కోట్లు,2021-22 రూ.1,18,393 కోట్లు, 2022-23 రూ.1,28,048 కోట్లు ,2023-24 ఎన్నికల సమయంలో సుమారు రూ.1,50,000 కోట్లు , మొత్తం నాలుగేళ్ల ఆఫ్ బడ్జెట్ లో రూ.7 లక్షల కోట్లకు పైగా వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రజలపై అప్పు బారాన్ని మోపిందన్నారు. అలాగే స్టేట్ ఫైనాన్స్ ఆడిట్ రిపోర్ట్ ప్రకారం రూ.3,37,530 కోట్లు,మొత్తం కలిపి సుమారు రూ.10,48,691 కోట్లు అన్నారు. ఈ అప్పు కూడా 12.8 శాతం 18 శాతం వడ్డీ రేటుకు డబ్బులు తెచ్చారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ 80 కి పైగా నిధులను వైసిపి ప్రభుత్వం వాడుకుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ. 60 ,70 కోట్లు చెల్లించి పథకాలను పున ప్రారంభించడం జరిగిందన్నారు.


**సీఎం పరిశ్రమలను ఆదుకోవాలి...**

పూర్వోదయ స్కీములో ఉమ్మడి ప్రకాశం జిల్లా ఉందని, ప్రస్తుతం పర్చూరు, చీరాల నియోజకవర్గాలు బాపట్ల జిల్లాలో ఉన్నాయని హార్టీ కల్చర్ కి అవకాశాలు ఉన్నాయ ఇక్కడ ఆయిల్ ఫామ్ సాగుకు అనుకూలంగా ఉందని పెద్ద మనసుతో సీఎం రెండు నియోజకవర్గాలకు అవకాశం కల్పించాలని కోరారు. వేలాది ఎం ఎస్ ఎం ఈ, గ్రానైట్ , స్పిన్నింగ్,చిన్న తరహా పరిశ్రమలను ఆదుకోవాలని కోరారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంగా యువనేత మహా యజ్ఞంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అమరావతిలో 50వేల కోట్ల పనులు జరుగుతున్నాయని,పదివేల కోట్ల పైగా మాన్ పవర్ అవసరం ఉందని స్కిల్ డెవలప్మెంట్ ద్వారా యువతకు నైపుణ్యం పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బడ్జెట్లో కేటాయింపులు పెంచేలా చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.

**దగాపడ్డ రాష్ట్రానికి దశాదిశా బడ్జెట్...**

దగాపడ్డ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక దశ దిశను చూపే సమగ్ర ప్రణాళిక , దార్శనిక నాయకుని ఉక్కుసంకల్పానికి ప్రతీక అన్నారు. ఐదు కోట్ల మంది ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశలు ఆకాంక్షలను ఆవిష్కరించే భవిష్యత్తు మార్గదర్శిని అన్నారు. స్థిరత్వం పారదర్శకత అభివృద్ధి అనే మూడు విలువలపై నిర్మితమైన భవిష్యత్తు ప్రయాణానికి మార్గం అన్నారు.

## భూములకు క్లియరెన్స్ ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేస్తాం





## ఉగాది నాటికి నిర్దేశించిన లక్ష్యం మేరకు గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలి

## కూటమి ప్రభుత్వం ఆక్వా రైతులకు అండగా నిలుస్తోంది

నోటిఫైడ్ ఆక్వాకల్చర్ జోన్ పేరుతో కేవలం పది ఎకరాలకే పరిమితం చేశారని మంత్రి గొట్టిపాటి అసెంబ్లీ వేదికగా సభ్యులకు వివరించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ పరిమితులను సవరించి రైతులకు అనుకూల నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే 50 వేల అదనపు ఆక్వాకల్చర్ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 5 లక్షల 21 వేల మంది ఆక్వా రైతులు యూనిట్‌కు రూ. 1.50 చెల్లిస్తూ సబ్సిడీ ప్రయోజనం పొందుతున్నారని మంత్రి తెలిపారు. ఆక్వా రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.



## జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 17)

జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ముందుగా స్కూలు, కాలేజీ విద్యార్థులకు హ్యాండ్ వాష్ చేసుకునే విధానాన్ని వివరించి, పరిశుభ్రత గురించి అవగాహన కల్పించడం జరిగింది. తరువాత నులిపురుగులు సోకిన పిల్లలు, కిశోర బాలలు రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు బరువు తగ్గడం వంటి వివిధ ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారని వీటన్నింటినీ నిర్మూలించడానికే ప్రతి ఏటా 2 సార్లు అనగా 6 నెలలకు ఒక సారి ఈ జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించుచున్నామని పొదిలి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ అయినటువంటి డా. పసుమర్తి. శరత్ చంద్ర తెలిపారు. నులిపురుగుల నిర్మూలన వలన కలిగే ప్రయోజనాలను గూర్చి వివరించారు. రక్తహీనతను నివారించి, పోషకాల గ్రాహ్యతను మెరుగుపరుస్తుందని, చదువుపై ఏకాగ్రతను పెంచి, నేర్చుకునే సామర్థ్యాన్ని పెంచుతుందని తెలిపారు. నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అన్ని అంగన్వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో ఉచితంగా అల్బెండజోల్ 400 మి.గ్రా. మాత్రను సరఫరా చేసి, 1 నుండి 5 సంవత్సరముల పిల్లలకు అంగన్వాడి కేంద్రాలలో, 6 నుండి 19 సంవత్సరముల పిల్లలు, కిశోర బాలలకు పాఠశాలలు, కళాశాలలలో మంగళవారం మధ్యాహ్నం పిల్లలందరూ భోజనం చేసిన తర్వాత అందరికీ అల్బెండజోల్ 400 మి.గ్రా. మాత్రలను కార్యకర్తలు దగ్గరుండి వేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివార్మింగ్ చేయబడని పిల్లలు, కిశోర బాలలు నమోదు అవ్వని, పాఠశాలకు వెళ్ళని పిల్లలు, కిశోర బాలలకు అంగన్వాడిలో మాత్రలు ఇవ్వబడతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ శరత్ చంద్ర పొదిలి గవర్నమెంట్ బాయ్స్ హై స్కూల్, కేజీబీవీ స్కూలు సందర్శించి ఆల్బెండజోల్ మాత్రలు అందించారు. ఈ కార్యక్రమంలో పొదిలి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్ చంద్ర, సూపర్వైజర్ మెరీనా, శ్రీనివాసరెడ్డి, ఎంపిహెచ్ఏ(ఎం), ఎఎన్ఎంలు, ఎంఎలహెచ్పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## పాఠశాలల తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహించాలి


### జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 17)

స్వర్ణ వార్డుల పరిధిలోని పాఠశాలల తనిఖీలను ప్రతి సోమవారం, గురువారం వార్డు వెల్ఫేర్, ఎడ్యుకేషన్ సెక్రటరీలు తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. తనిఖీల సమయంలో బోధన-అభ్యాస వ్యవస్థ, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పారిశుద్ధ్య పరిస్థితులు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. నిర్వహించిన తనిఖీలకు సంబంధించిన ఫోటోలు, వివరాలను సమగ్ర పర్యవేక్షణ నిర్వహణ వ్యవస్థ యాప్‌లో తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని తెలిపారు. ఇప్పటివరకు వార్డు డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు నిర్వహిస్తున్న బాధ్యతలను ఇకపై వెల్ఫేర్, ఎడ్యుకేషన్ సెక్రటరీలు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి, నివేదికలను నిర్ణీత గడువులో సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో డీఈవో శ్రీనివాస్ సింగ్, జీఎస్‌డబ్ల్యూ జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్, వర్చువల్ విధానంలో మండలాల ఎంఈవోలు హాజరయ్యారు.

## ముస్లిం విద్యార్థి మరణం పై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలి



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 17)

సింగరాయకొండ మండలం మూలగుంటపాడు గ్రామంలో శ్రీ చైతన్య నవోదయ స్కూల్ నందు ఆరో తరగతి చదువుతున్న ముస్లిం విద్యార్థి మరణం పై జిల్లా కలెక్టర్ పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని 139 బీసీ కులాలు జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సయ్యద్ అలీ కుమారుడు ఆరో తరగతి చదువుతూ ఉరి వేసుకునే మరణించినట్లుగా స్కూలు యాజమాన్యం చెప్పడం పై వెంటనే విచారణ జరిపించాలన్నారు. విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నట్లుగా తమ కుమారుడిని గొంతు నొక్కి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారన్న విషయంపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. లేని ఎడల విద్యార్థి కుటుంబానికి అండగా న్యాయం జరిగే వరకూ పోరాడుతామని శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి చదువుకునే విద్యార్థికి ఉరిపోసుకోవటం తెలుసా అని ప్రశ్నించారు. విద్యార్థి మరణానికి సంబంధించి న్యాయం జరగకపోతే తీవ్ర ఉద్యమం చేపట్టబోతున్నామని తెలిపారు.

## ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి




(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఫిబ్రవరి 17)

విజయవాడ అలంకార థియేటర్ వద్ద జరిగే రణభేరి 2.0 ధర్నా కు రాష్ట్ర కౌన్సిలర్ పి రవికుమార్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాయక్, డి మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎర్రగొండపాలెం మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు, సీనియర్ నాయకులు మంగళవారం వెళ్ళారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిలర్ పి రవికుమార్ మాట్లాడుతూ 27% ఐఆర్ ఇవ్వాలి, పాత డిఏ బకాయిలు వెంటనే చెల్లించి ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ డి వార్మింగ్ డే







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 17)

మండల కేంద్రమైన ఉలవపాడు జీవీఎస్ఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం"నేషనల్ డి వార్మింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జిఎల్ సుధారాణి మాట్లాడుతూ నులిపురుగులు చిన్న సమస్య కాదు అలాగని పెద్ద సమస్య కాదు చిన్న పిల్లలను వేధించే చికాకు సమస్య, ఆరోగ్యంగా పిల్లలు ఎదగాలంటే ఆరోగ్యకరమైన జీర్ణ వ్యవస్థ ఉండాలి మనదేశంలో 65% మంది నులిపురుగులతో బాధపడుతున్నారు. ఆరోగ్యం వంతమైన పిల్లల భవిష్యత్తు కోసం నులిపురుగులను వారిద్దమని ప్రిన్సిపాల్ తెలియజేశారు. ప్రిన్సిపల్ అధ్యక్షతన హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ డి సుజాత నులి పురుగు మాత్రలైన ఆల్బెండజోల్ విద్యార్థులకు మింగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గవర్నమెంట్ ఆరోగ్య శాఖ ప్రాథమిక కేంద్రం కరేడు వారు పిల్లల కు హ్యాండ్ వాష్ ఎలా చేసుకోవాలో ఎలా తమ చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలో తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారు.

## జేఈఈ మెయిన్స్-2026 ఫేజ్ 1లో బీజెఎస్ఆర్ కళాశాల విద్యార్థి ప్రతిభ



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 17)

దేశవ్యాప్తంగా వెలువడిన జేఈఈ. మెయిన్ 2026 (ఫేజ్1)స ఫలితాల్లో బద్వేల్ పట్టణంలోని డాక్టర్ బీజెఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థి నల్దేశి సుధీక్షిత్ 96.74 శాతం సాధించి కళాశాలకు కీర్తి తీసుకొచ్చాడు. విద్యార్థి విజయంపై కళాశాల కరస్పాండెంట్ బి. జయ సుబ్బారెడ్డి అభినందనలు తెలిపారు. అధ్యాపకుల శ్రమ, తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థి పట్టుదల ఫలితంగానే ఈ విజయాన్ని సాధించగలిగామని పేర్కొన్నారు. సుధీక్షిత్ తండ్రి సుబ్బారాయుడు మాట్లాడుతూ సుభాష్ గాయత్రి కళాశాల మాజీ ప్రిన్సిపాల్‌గా పనిచేసినట్లు తెలియజేస్తూ, తన కుమారుడి విజయంపై ఆనందం వ్యక్తం చేశారు. అధ్యాపక బృందానికి, యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు బి. వీరశేఖర్ రెడ్డి, బి. శివశంకర్ రెడ్డి, బి. గురవయ్య, బి. సుదర్శన్ రెడ్డి, జి. వినోద్, ఏ. పోలిరెడ్డి, ఎన్. నరసింహ, కె. మస్తాన్ రెడ్డి, ఆర్. సురేష్ బాబు, కె. రామకృష్ణ, పి. జాకీర్ హుస్సేన్, బి. కాశి, కె. గౌరీ శంకర్, కె. జయ సుబ్బారెడ్డి, కె. వెంకట రామిరెడ్డి, జి. ఓబయ్య, కె. రాయుడు, ఎం. సురేష్ లు విద్యార్థి విజయం పై హర్షం వ్యక్తం చేశారు.

## నులి పురుగులు నివారణ దినోత్సవం



(షణ్ముఖ వెలుగు, సీఎస్‌పురం, ఫిబ్రవరి 17)

మంగళవారం స్థానిక జెడ్పీహెచ్ స్కూల్ నందు ఆల్బెండ్జోల్ ట్యాబ్లెట్స్ విద్యార్థులకు మింగించారు. చేతి వేళ్ళు, గోర్లు కత్తిరించుకోమని, మలమూత్రాదులు విసర్జించిన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవడం మొదలగు ఆరోగ్య విషయాలు గురించి మాట్లాడటం జరిగింది. మండలంలో మొత్తం పిల్లలు 5779 గాను మంగళవారం 5497 మందికి 95% ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళి, హెల్త్ అసిస్టెంట్స్ జి రామకృష్ణ, కె కొండయ్య, స్కూల్ ప్రధానోపాధ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నగరంలో దోమల నివారణకు చర్యలు






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17)
ఒంగోలు నగర పాలక సంస్థలోని 50వ డివిజన్ పరిధిలో, నగరంలోని దోమల నివారణకు మున్సిపల్ కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు డ్రైన్స్ బ్లాక్ క్లీనింగ్, ప్రతి మంగళవారం శుక్రవారం డ్రైన్సలలో యాంటీ లెవెల్ స్ప్రేయింగ్ చేయిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం ఒక్కొక్క డివిజన్ చొప్పున ఫాగింగ్ చేయిస్తున్నామని దోమల నివారణకు ఈ మంగళవారం నుండి ఉదయం 6 గంటలకు పట్టణంలోని కల్వరిరెంట్స్ కింద ఫాగింగ్ చేయించు కార్యక్రమం చేపట్టినట్లు మున్సిపల్ ఎస్ఎస్ పిచ్చయ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కమ్మపాలెం నుండి ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమం వలన పగటివేలలో కల్వెట్స్ కింద ఆవాసాలు ఏర్పాటు చేసుకొని ఉన్న దోమలను నివారించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

# డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17)
ఈగల్ ఐజీపి ఆ కే రవికృష్ణ ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు సూచనల మేరకు ఐటీఐ కాలేజీ ఒంగోలు, విద్యార్థులకు, కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్ ఎస్వీ ప్రసాద్ ఉధ్యాయులకు ఆధ్వర్యంలో ఈగల్ టీమ్ వారు విద్యార్థులకు డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయటం జరిగింది. ఈగల్ విభాగం యొక్క విధి విధానాలు ఆపరేషన్ గరుడ, ఆపరేషన్ సేఫ్ క్యాంపస్, ఆపరేషన్ ఈగల్ ట్రైన్ , ఆపరేషన్ చైతన్యం గురించి వివరించారు. గంజాయి కి సంబంధించి ఎన్‌డీపీఎస్ యాక్ట్ వాటి వలన కలిగే అనర్థాలు, కేసుల శిక్షల గురించి తెలియజేయడం జరిగింది. అదేవిధంగా విద్యార్థులు ఏ విధంగా గంజాయి బారిన పడుతున్నారు అని అవగాహన కల్పించడం జరిగింది. అందరి చేత డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదం చెప్పించడం జరిగింది. డ్రగ్స్ గురించి ఏమైనా సమాచారం తెలిసినట్లయితే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972కి కాల్ చేసి తెలియజేయాలన్నారు. మీ యొక్క వివరములు చాలా గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

# వ్యక్తిగత పరిశుభ్రత ద్వారా నులిపురుగులను నివారించవచ్చు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 17)
నేషనల్ డి వార్మింగ్ డే ను పురస్కరించుకొని మంగళవారం కంబాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బెల్లంకొండ కాలేజ్‌లో విద్యార్థినులకు ఆల్బండెజోలు మాత్రలు అందించి నులు పురుగుల నివారణ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర బిజెపి మహిళా మోర్చా కార్యదర్శి బెల్లంకొండ విజయలక్ష్మి ప్రసంగిస్తూ నేషనల్ డీ వార్మింగ్ డే ను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, ఆగస్టు నెలలో (ఆరు నెలలకు ఒకసారి) స్థానిక వైద్య సిబ్బంది సహకారంతో నులి పురుగుల నిర్మూలన (ఆల్బండజోల్ ట్యాబ్లేట్స్) మాత్రలు పంపిణీ చేస్తారన్నారు. ఈ టాబ్లెట్స్‌తో పాటు, మనం తినే ఆహారంలో ఎక్కువగా వెల్లుల్లి, ఉల్లి, బొప్పాయి, గుమ్మడి గింజలు, శుభ్రమైన నీరు, ఆహారం, ఎప్పటికప్పుడు గోళ్లు కత్తిరించుకొని, భోజనానికి ముందు వెనుక చేతులు శుభ్రంగా కడుక్కుని, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే నులిపురుగులను నిర్మూలించవచ్చనన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు పిల్లి రమణారెడ్డి, టిడిపి నాయకులు డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావు, సచివాలయ వైద్య సిబ్బంది సుభాని, రమాదేవి, విద్యార్థులకు ఆల్బండజోల్ టాబ్లెట్స్ అందజేసి "నులి పురుగుల నివారణ పై" అవగాహన కలిగించారు. విద్యా కమిటీ చైర్మన్ యుద్ధం వెంకటేశ్వర్లు, స్థానిక టిడిపి నాయకులు కల్లూరి రవి కుమార్‌రెడ్డి, బెల్లంకొండ కాలేజీ ప్రిన్సిపల్ తోట శ్రీనివాసులు, ఫార్మసీ లెక్చరర్ కుమారి హామీదా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.






# త్రోవగుంటలో పచ్చాకుకు ట్రాక్టర్ బోల్తా మద్దిరాలపాడు వాసి మహిళ మృతి



## ముగ్గురికి తీవ్ర గాయాలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17)
ఒంగోలు సమీపంలోని త్రోవగుంట వద్ద విషాదకరమైన ప్రమాదం చోటుచేసుకుంది. పచ్చాకు కూలీలు ట్రాక్టర్‌కు పచ్చాకు లోడ్ చేసుకుని హైవే పైకి ఎక్కిస్తుండగా వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నాగులుప్పలపాడు మండలం మదిరాలపాడు గ్రామానికి చెందిన చాట్లగడ్డ ఎమీలియా ఎస్సీ మాదిగ అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబానికి ప్రధాన ఆధారమైన వ్యక్తి అకాల మరణంతో



గ్రామంలో విషాదం నెలకొంది. స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ సాయంతో గాయపడిన వారిని ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉసిరిపాటి ఆరోగ్యమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన ఉసిరిపాటి ఆరోగ్యమ్మ (36), దీప్తి (36), సారీ కుక్కా జ్యోతి (40) మెరుగైన వైద్యం కోసం ప్రవేట్ హాస్పటల్ కు తరలించారు. ఘటన పై తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




# కరేడులో నులిపురుగులు నివారణ దినోత్సవం

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 17)
జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉలవపాడు మండలం కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో పిల్లలందరికీ అంగన్‌వాడీ స్కూల్స్, ఎలిమెంటరీ స్కూల్స్, కరేడు కేజీబీవీ, ఉలవపాడు, వెరైటీ





హైస్కూల్ ప్రైవేట్ స్కూల్ మొత్తం 5573 మంది పిల్లలకు గాను 546 మంది పిల్లలకు మాత్రలు మింగించడం జరిగింది. మిగిలిపోయిన పిల్లలకు మాపప్ కార్యక్రమం 24వ తేదీ జరుగుతుంద ని వరేడు వైద్య అధికారి డా. ఏ అనిల్ కుమార్ తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ లక్ష్మీనారాయణ, పీహెచ్ఎన్ సీతారాములు, హెచ్ వి వసంత, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# మీర్జా ఉస్మాన్ బేగ్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అన్నా

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 17)
ఏ1 గ్లోబల్ కాలేజీ అధినేత షేక్ మీర్జా షంషీర్ అలీ బేగ్ తండ్రి మీర్జా ఉస్మాన్ బేగ్ (85) అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరు ఏఆర్‌కేఏ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకొన్న గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్నా వెంకట రాంబాబు ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.



# చదువుతోపాటు ఆరోగ్యం కాపాడుకోవాలి జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 17)
విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యం కాపాడుకోవాలని జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు అన్నారు. మార్కాపురం పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజు శుభ్రతను పాటించి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మార్కాపురం డి ఎంహెచ్ఓ టి వాణిశ్రీ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, ఆగస్టు నెలలో రెండుసార్లు జరుగుతుందని ఒకటి నుంచి 19 సంవత్సరాలు లోపు విద్యార్థులు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్కాపురం జిల్లాలో 2.93 లక్షల మంది విద్యార్థులకు ఈ నులిపురుగుల మాత్రలు అందించనున్నట్లు ఉన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి కె రాహుల్, మార్కాపురం డిప్యూటీ డిఎంహెచ్ఓ మనస్సే, కనిగిరి డిప్యూటీ డిఎంహెచ్ఓ సుజన, ప్రోగ్రాం అధికారి చంద్రశేఖర్, రాష్ట్ర కన్సల్టెన్స్ నరేష్, గంగాధర్, ఇతర ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాల కట్టడికి ఎన్‌ఫోర్స్‌మెంట్ ముమ్మరం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17)
పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో టాస్క్ ఫోర్స్ సీఐ యు సుధాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐలు సుదర్శన్, చెంచయ్య, ఏఎస్ఐ మహబూబ్ భాషా, సిబ్బంది కలసి మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని దొడ్డవరం గ్రామ పొలాలలో పేకాట స్థావరం పై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 5 మోటార్ సైకిళ్లు, ఆరు సెల్ ఫోన్లు, రూ.65,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూద క్రీడలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అలాగే జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి కార్యక్రమాలకు సంబంధించి సమాచారం ఉంటే, వెంటనే డయల్ 112 నంబర్‌కు లేదా పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266కు మెసేజ్ ద్వారా తెలియజేయాలని ప్రజలను కోరారు.

# పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ నిరసన



(షణ్ముఖ వెలుగు, బద్వేలు, ఫిబ్రవరి 17)
తమ పై పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ వీఆర్, వీఆర్ఎలు బద్వేలు తహశీల్దారు కార్యాలయం వద్ద సంయుక్తంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ తమకు భూముల రీసర్వేతో పాటు హౌస్ సర్వే చేయాలని ప్రభుత్వం తమపై అధిక ఒత్తిడి తెస్తోందని, దీంతో తాము ప్రజలకు పూర్తి సహకరించలేకున్నావ దీని తమ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమకు ఒత్తిడి అధికమైందని, కావున తమకు ఒకేసారి రెండు, మూడు పనులు కేటాయించడం సరికాదని, దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని జిల్లా వీఆర్ఎ సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ జగదీశ్వర్రెడ్డి పేర్కొన్నారు. అలాగే ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రిలు తమ సమస్యపై దృష్టిసారించి పని ఒత్తిడి తగ్గించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల వీఆర్వోలు, వీఆర్ఎ, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా, బాలుడు మృతి
### పాత అన్న సముద్రంలో విషాద ఘటన




(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, ఫిబ్రవరి 17)
మండలంలోని పాత అన్న సముద్రం గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పసుపులేటి వెంకట చంద్రశేఖర్ అనే బాలుడు ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం మంగళవారం మధ్యాహ్నం సుమారు 1 గంట సమయంలో వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్ నడుపుతున్న సమయంలో అదుపుతప్పి సమీపంలోని కాలువలోకి బోల్తా పడింది. డ్రైవింగ్ సరిగా చేయలేకపోవడం వల్ల ట్రాక్టర్ ఒరిగిపోయి బాలుడు ట్రాక్టర్ కింద ఇరుక్కుపోయినట్లు తెలుస్తోంది. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ప్రమాదం గమనించిన గ్రామస్తులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ట్రాక్టర్‌ను పైకి లేపి బాలుడిని బయటికి తీశారు. అయితే అప్పటికే అతను మృతిచెందినట్లు తెలిసింది. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది. మృతుడి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. వ్యవసాయ పనుల సమయంలో సరైన జాగ్రత్తలు పాటించాలని, అనుభవం లేని వారు వాహనాలు నడపరాదని అధికారులు సూచిస్తున్నారు.


## విద్యార్థులకు నులిపురుగులు మాత్రలు పంపిణీ



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఫిబ్రవరి 17)
మండలంలోని అన్ని పాఠశాలలో, అంగన్వాడి కేంద్రాలలో, జూనియర్ కళాశాలలో 4988 మంది విద్యార్థులకు గాను 4935 మంది విద్యార్థులకు నులిపురుగు మాత్రలను మింగించారు. వైద్య అధికారులు మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనత నివారించడానికి ఆల్బెండజోల్ మాత్రలు మింగినట్లయితే రక్తహీనత తగ్గించవచ్చని తెలిపారు.ఆల్బెండజోల్ 400మీ .గ్రామ మాత్రలు ఏడాదిలో రెండుసార్లు వేసుకుంటే నులిపురుగుల్ని నిర్మూలించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు కృష్ణ చైతన్య, శ్రీకాంత్, రవి కిరణ్, మల్లికార్జునరావు, సిహెచ్ఓ భాస్కరరావు, హెచ్ఇఓ సురేష్, గిరిజ, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, తదితరులు పాల్గొన్నారు.

## చాకిచెర్ల రైల్వే గేట్ మూసివేత సమస్య పై చర్చలు





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 17)
మండల పరిధిలోని చాకిచెర్ల గ్రామ సచివాలయంలో మంగళవారం కందుకూరు సీఐ షేక్ అన్వర్ భాష, ఉలవపాడు తహశీల్దార్ టి శ్రీనివాసులు, ఆర్‌పిఎఫ్ ఎస్ఐ, ఎస్ఎస్ఈ రైల్వే, ఆర్‌విఎన్ఎల్ ప్రతినిధులు, ఉలవపాడు పోలీస్ సిబ్బంది చాకిచెర్ల రైల్వే గేట్ మూసివేత సమస్య దృష్ట్యా జరిగిన చర్చలకు హాజరయ్యారు. చాకిచెర్ల, పెద్దపట్టపుపాలెం, చాగల్లు, రామాయపట్నం గ్రామాల నుండి ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. మౌఖికంగా, రాతపూర్వకంగా తమ ప్రాతినిధ్యాన్ని సమర్పించారు. రైల్వే అధికారులు తాత్కాలికంగా పనిని ఆపేస్తామని హామీ ఇచ్చారు. సమస్య తాత్కాలికంగా పరిష్కరించబడిందని స్థానిక ఎస్ఐ జి సుబ్బారావు తెలియజేశారు.

# రేపటి నుండి పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం

### ఉపవాసం, జకాత్, ఫిత్రా, హజ్ మహత్తర కర్తవ్యాలతో ముస్లింల ఆధ్యాత్మిక సాధనకు శ్రీకారం

(షణ్ముఖ వెలుగు, కంభం, ఫిబ్రవరి 17)
చంద్రోదయం దర్శనమిచ్చిన వెంటనే గురువారం నుంచి ప్రపంచవ్యాప్తంగా పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కానుంది. ఇస్లాం ధర్మంలో అత్యంత పవిత్రమైన ఈ నెలలో కోట్లాది మంది ముస్లిలు ఉపవాసాలు (రోజాలు) ఆచరిస్తూ ఆధ్యాత్మిక సాధనలో నిమగ్నమవుతారు. భక్తి, నియమ నిష్ఠ, సేవా భావం, సమానత్వం, సహనం వంటి విలువలను జీవన విధానంలో ప్రతిబింబింపజేసే కాలంగా రంజాన్ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. రంజాన్ మాసం ఇస్లాం యొక్క ఐదు ప్రధాన స్థంభాలతో ముడిపడి ఉన్న మహత్తర ఆధ్యాత్మిక పర్వం. ఉపవాసం (సౌమ్), నమాజ్ (సలాత్), ఫిత్రా, జకాత్, హజ్, కలిమా వంటి విధులను స్మరించుకునే సమయం ఇదే. ఈ నెలలో ప్రతి ముస్లిం తన ఆచరణలో క్రమశిక్షణ పాటిస్తూ అల్లాహ్‌కు మరింత సమీపం కావాలని సంకల్పిస్తాడు.


**ఉపవాసం శరీరానికి కాదు, మనసుకు**

రంజాన్ ఉపవాసం సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఆహారం, నీరు తీసుకోకపోవడం మాత్రమే కాదు. కోపం, అసూయ, ద్వేషం, అహంకారం వంటి నెగెటివ్ భావాలను దూరం పెట్టి, మనసును పరిశుభ్రం చేసుకోవడం అసలు ఉద్దేశం. ఉపవాసం ద్వారా మానవుడు ఆకలిని అనుభవించి పేదవారి స్థితిని అర్థం చేసుకుంటాడు. ఇది సహానుభూతిని పెంచే సాధనంగా భావించబడుతోంది. మత పండితుల ప్రకారం, ఉపవాసం క్రమశిక్షణకు మూలాధారం. నిర్దిష్ట సమయానికి సహరీ (ఉపవాసానికి ముందు తీసుకునే ఆహారం), ఇఫ్తార్ (సాయంత్రం ఉపవాస విరమణ) నిర్వహించడం ద్వారా సమయపాలన అలవడుతుంది. శరీరానికి విశ్రాంతి, మనసుకు నియంత్రణ అనే రెండు లక్ష్యాలను ఇది చేరువ చేస్తుంది.

**ఖుర్ఆన్ అవతరణ - రంజాన్ యొక్క అత్యున్నత ఘనత**

పవిత్ర ఖుర్ఆన్ ఈ రంజాన్ నెలలోనే అవతరించినదిగా అల్లాహ్ మాటపై ముస్లింల పూర్తి విశ్వాసం. అందుకే ఈ నెలను "షహ్రుల్ ఖుర్ఆన్" అని కూడా పిలుస్తారు. రాత్రి వేళల్లో మసీదుల్లో తరావీహ్ నమాజులు నిర్వహించబడతాయి. ఖుర్ఆన్ సంపూర్ణ పఠనం ఈ నెలలో పూర్తి చేయడం అనేక మంది లక్ష్యంగా పెట్టుకుంటారు. కుటుంబ సభ్యులు కలిసి ప్రార్థనలు చేయడం ద్వారా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది.

**జకాత్-సంపదలో సమాజ హక్కు**



ఇస్లాం ధర్మంలో జకాత్ ఒక విధిగా పేర్కొనబడింది. సంపాదనలో ఒక నిర్దిష్ట భాగాన్ని పేదలకు ఇవ్వడం ద్వారా సమాజంలో ఆర్థిక సమానత్వాన్ని పెంపొందించడమే లక్ష్యం. రంజాన్ నెలలో జకాత్ చెల్లించడం అత్యంత పుణ్యకార్యంగా భావించబడుతుంది. దీనివల్ల అనాథలు, విధవలు, ఆర్థికంగా వెనుకబడినవారికి సహాయం అందుతుంది. సమాజంలోని బలహీన వర్గాల సంక్షేమానికి ఇది గొప్ప వ్యవస్థగా నిలుస్తోంది. అలాగే ఖురాన్ లో అల్లాహ్ లైలతుల్ ఖద్ర్ గురించి ప్రస్తావించారు.

**లైలతుల్ ఖద్ర్ ఘనత**

ఖురాన్ అల్లాహ్ లైలతుల్ ఖద్ర్ (ఘనమైన రాత్రి)గురించి తాకీదు చేశారు. ఈ రాత్రి వెయ్యి నెలల కంటే శ్రేష్ఠమైనదని ఆరాత్రి వెయ్యి నెలల కంటే శ్రేష్ఠమయినదని అల్లాహ్ పై పూర్తి విశ్వాసం, అలాగే ఆరోజు దైవదూతలు భూమిపై సంచరిస్తూ ప్రార్థనలు నేరుగా అల్లాహ్ దగ్గరికి తీసుకొని వెళ్తారన్న విశ్వాసంతో రంజాన్ మాసం చివరి పదిరోజులలోని బేసి సంఖ్య 21, 23, 25, 27, 29 రాత్రులలో రాత్రంతా మస్జీద్‌లలో జాగారం చేస్తూ నమాజులు, ఖురాన్ పారాయణం చేస్తూ తమ పాపాల పరిహారం కోసం అల్లాహ్ ఏడుస్తూ దుఆ చేస్తారు.

**ఫిత్రా-పండుగ ఆనందంలో అందరికీ భాగస్వామ్యం**

రంజాన్ ముగింపులో జరుపుకునే ఈద్ ఉల్ ఫిత్ర్ పండుగకు ముందు ప్రతి కుటుంబంలోని ప్రతి వ్యక్తి(అప్పుడే పుట్టిన పసిపాప నుండి) ఫిత్రా చెల్లించడం తప్పనిసరి. ఫిత్రా ద్వారా పేదవారూ ఈద్ పండుగను సంతోషంగా జరుపుకునే అవకాశం పొందుతారు. ఇది సామాజిక బాధ్యతను గుర్తుచేసే దాతృత్వ విధానం.

**హజ్-పరిపూర్ణ సమర్పణకు చిహ్నం**

ఇస్లాం యొక్క ఐదు ప్రధాన స్థంభాలలో హజ్ యాత్ర ఒకటి. జీవితంలో ఒకసారైనా మక్కా నగరంలోని పవిత్ర కాబాను దర్శించుకోవడం ప్రతి సామర్థ్యవంతుడైన ముస్లింకి విధిగా పేర్కొనబడింది. రంజాన్ మాసం హజ్ ఆధ్యాత్మికతను స్మరింపజేసే కాలంగా భావించబడుతుంది. ఉపవాసం ద్వారా సాధించిన సహనం, నియమ నిష్ఠ హజ్ యాత్రలో కూడా ప్రతిఫలిస్తుంది.

**ఆరోగ్య, సామాజిక ప్రయోజనాలు**

వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, సమయపాలనతో పాటించిన ఉపవాసం శరీరానికి విశ్రాంతి ఇస్తుంది. అయితే ఆరోగ్య సమస్యలున్నవారు వైద్యుల సూచనల మేరకు ఉపవాసం ఆచరించాలి.

**రంజాన్ కాలంలో ఇఫ్తార్ విందులు**

కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ విందులో ప్రతి ఒక్కరూ పాల్గొని ఒకరిపట్ల ఒకరికి సోదరభావం కలిగే విధంగా ఇఫ్తార్ విందులో పాల్గొంటారు.పేదలకు ఆహార పంపిణీ, సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించబడతాయి. సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం పెంపొందుతాయి.

**శాంతి, సహనం, సోదరభావానికి పిలుపు**

పవిత్ర రంజాన్ మాసం. మానవాళికి శాంతి, సహనం, పరస్పర గౌరవం అనే విలువలను గుర్తుచేస్తుంది. ప్రపంచంలో నెలకొన్న అసమానతలు, విభేదాలు తొలగిపోవాలని, మానవ సమాజం ఐక్యంగా ముందుకు సాగాలని ముస్లిం పెద్దలు ప్రార్థిస్తున్నారు.
నేటి చంద్రోదయంతో ప్రారంభమయ్యే ఈ పవిత్ర రంజాన్ మాసం ప్రతి ఒక్కరి జీవితంలో ఆధ్యాత్మిక వెలుగును నింపాలని ముస్లిం సంఘాల ప్రతినిధులు అల్లాహ్ తో దుఆ చేస్తున్నారు.

## మేర యువ భారత్ యువ వాలంటీర్ల నోటిఫికేషన్ విడుదల

### ఆసక్తి కలిగిన యువత అప్లై చేసుకోండి
### జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17)
ప్రకాశం జిల్లాలో మై భారత్ యువ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి తెలిపారు. ఆసక్తి కలిగిన మరియు అర్హత కలిగిన యువత ఈ అవకాశాన్ని వినియోగించుకొని వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ నియామకానికి అభ్యర్థులు కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. 01 ఏప్రిల్ 2025 నాటికి వయస్సు కనీసం 18 సంవత్సరాలు, గరిష్టంగా 29 సంవత్సరాలు ఉండాలని ప్రకాశం జిల్లా వాసులై ఉండాలి తెలిపారు. ప్రస్తుతం రెగ్యులర్ విద్యార్థులుగా చదువుతున్న వారు ఈ పథకానికి అర్హులు కారని స్పష్టం చేశారు. ఎంపిక ప్రక్రియలో ఉన్నత విద్యార్హతలు కలిగి కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, అలాగే మై భారత్ అనుబంధ యువజన సంఘాల సభ్యులకు ప్రాధాన్యత కల్పించబడుతుందని తెలిపారు. ఎంపికైన యువ వాలంటీర్లకు నెలకు రూ.5,000 (అన్ని కలిపి) గౌరవ వేతనం అందించబడుతుందని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 20వ తేదీ చివరి తేదీగా నిర్ణయించబడినందున ఆసక్తి కలిగిన యువత గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఆన్లైన్ దరఖాస్తు కొరకు 9963533440 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి వక్తృత్వ పోటీలు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 17)
జన విజ్ఞాన వేదిక పొదిలి మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి వక్తృత్వ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పొదిలి మండల శాఖ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పొదిలి మండల యం.ఇ.ఓ నాగలక్ష్మి , ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలికలు), పొదిలి ప్రధానోపాధ్యాయులు రోజా రాణి, త్యాగరాజ కళా క్షేత్రం నాగ శ్రీ పాల్గొని సందేశాలు ఇచ్చారు. ఈ వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు, నీకు నచ్చిన దేశ నాయకుడు, ప్లాస్టిక్ కాలుష్యం-నివారణలు, ఆహారపు అలవాట్లే ఆరోగ్యాన్ని నిర్ణయిస్తాయి. నీకు నచ్చిన శాస్త్రవేత్త, నేటి విద్యా విధానం వంటి అంశాలపై ప్రభావవంతమైన ప్రసంగాలు చేశారు. ఈ పోటీలకు జడ్జీలుగా జవహర్ నర్సింగ్ హోమ్ డాక్టర్ బి జవహర్, సీహెచ్ రమేష్, డాక్టర్ వేణు గోపాల్, ఏ వీరారెడ్డి వ్యవహరించి విద్యార్థుల ప్రసంగాలను నిష్పక్షపాతంగా మూల్యాంకనం చేశారు. దీనిలోని భాగంగా పొదిలి మండల మొదటి బహుమతి కె ఇందు-గీతాంజలి హై స్కూల్ పొదిలి, రెండవ బహుమతి షేక్ మిశ్బ హీన-సంస్కృతి విద్యాలయ - పొదిలి, మూడవ బహుమతి జ్యోతిర్ బిందు - ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలికలు) పొదిలి వారు సాధించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్, బహుమతులు, ప్రైజ్ మనీ అందజేశారు. మొదటి బహుమతి రూ.3000 వరికుంట్ల అనిల్ కుమార్ (పండు), రెండవ బహుమతి రూ.2000 డాక్టర్ సిగేనం పెద బాలయ్య, మూడవ బహుమతి రూ.1500 డాక్టర్ చక్రవర్తి ప్రైజ్ మనీని అందజేసారు. పుస్తకాలను కృష్ణా మొబైల్స్ ప్రతాప్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షులు షేక్ గయాజ్ భాషా, రాష్ట్ర నాయకులు కొల్లా మధు, కంచర్ల వెంకటేశ్వర్లు, ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె టి సి పాపారాయుడు, పొదిలి మండలశాఖ అధ్యక్షులు గోపనబోయిన శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వేల్పుల వెంకట్ యాదవ్, విద్యా కమిటీ కన్వీనర్ నరేంద్ర, మిత్ర బృందం అధ్యక్షతన జరిగింది. వక్తలు మాట్లాడుతూ ఇలాంటి వక్తృత్వ పోటీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, శాస్త్రీయ దృక్పథం, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని జన విజ్ఞాన వేదిక పొదిలి మండల శాఖ నాయకులు పేర్కొన్నారు.



## రథోత్సవాన్ని ప్రారంభించిన టిడిపి ఇన్చార్జి ఎరిక్షన్ బాబు
### వైభవంగా శివ పార్వతుల రథ మహోత్సవం




(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, ఫిబ్రవరి 17)
త్రిపురాంతకంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ త్రిపురాంతకేశ్వరం, శ్రీమద్ బాల త్రిపుర సుందరి దేవి అమ్మవారు ఆలయాల్లో మహా శివరాత్రి సందర్భంగా మంగళవారం శివాలయం లో విశేష పూజలు నిర్వహించి ఉత్సవ విగ్రహాలను పల్లకిపై రథశాల దగ్గరికి చేర్చి పూజలు నిర్వహించారు. తదుపరి అలంకరించబడిన రథంపై శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఉంచి ఊరేగింపు అంగరంగ వైభవంగా ప్రారంభమైనది. యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు రథయాత్రను రథాన్ని లాగి ప్రారంభించారు. అనంతరం అక్కడి నుండి రథం ఊరేగింపు అన్నదాన సత్రాల మీదుగా పారువేటం మండపం వరకు రథోత్సవము నిర్వహించారు. శివనామ స్మరణ తో తిరుణాల ప్రాంగణం మార్మోగింది. ప్రజలు వేలాదిగా రథయాత్రలో పాల్గొని రథాన్ని లాగడం జరిగింది. రథాన్ని లాగడం భక్తులకు ఒక గొప్ప ఆధ్యాత్మిక అనుభూతిగా, పుణ్యకార్యంగా ఈ సందర్భంగా పండితులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వేలాదిగా భక్తజనం పాల్గొన్నారు. భక్తులకు ఫలహారాలు మజ్జిగ పలు స్వచ్ఛంద సేవా సంస్థలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రథ మహోత్సవానికి పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

# విద్యార్థులకు క్రమశిక్షణ చాలా ముఖ్యం

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్









(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 17)

అన్నింటిలో నెంబర్ 1గా విద్యార్థులు నిలవాలంటే క్రమశిక్షణ చాలా ముఖ్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా వేటపాలెం మండలం దేశాయిపేట ఎంజెపి ఏపి బిసి సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు జిల్లా కలెక్టర్ మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ కు పుష్పాలతో విద్యార్థులు ఘనంగా ఆహ్వానం పలికారు. సంవత్సరాంత పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు స్ఫూర్తి నింపుతూ ప్రసంగం చేశారు. చేతులను శుభ్రంగా కడుగుకోవడంపై విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శన అందరిని అబ్బురపరిచింది.

భవిష్యత్తులో నెంబర్ వన్ స్థానంలో నాయకుడిగా నిలవడానికి క్రమశిక్షణతోపాటు పట్టుదల ఉండాలని కలెక్టర్ పునరుద్ఘటించారు. మీ లక్ష్యం గొప్పగా ఉండాలి, అప్పుడే మీరుద్దేశించిన గమ్యానికి చేరుకోగలరన్నారు. పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఏపీలోనే బాపట్ల జిల్లాలోని విద్యార్థులంతా టాప్ వన్ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. నిరంతరం క్రమశిక్షణతో మెలగడం ద్వారానే క్రికెట్ క్రీడాకారుడు సచిన్ టెండూల్కర్ అంతర్జాతీయ క్రీడాకారుడిగా చరిత్ర సృష్టించారన్నారు. నేను నెంబర్ వన్ లీడర్ గా ఎదగాలనే పట్టుదల జిజ్ఞాస మీలో ఉండాలన్నారు. క్రమశిక్షణతో నిరంతరం సాధన చేయడం ద్వారా మీరు అనుకున్న లక్ష్యాలను చేరుకోగలరని వారిలో స్ఫూర్తి నింపారు. ఒక ఉపాధ్యాయుడు ప్రోత్సాహంతోనే నేను పదో తరగతి చదివేటప్పుడు నేషనల్ టాలెంట్ టెస్ట్ లో ఎంపిక అయ్యానని తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. దేశవ్యాప్తంగా ఎంపికైన వెయ్యి మందిలో నేను ఒకనిగా నిలవడం నా జీవితానికి స్ఫూర్తిని నింపిందన్నారు. మా జిల్లా నుంచి నేను ఒక్కడిని మాత్రమే ఎంపికయ్యానని తన విజయాలను మననం చేసుకున్నారు. విద్యార్థులు బాగా చదువుకుంటూ ఆరోగ్యంతో ఎదగడానికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండడానికి ప్రభుత్వం నులిపురుగుల మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాన్ని వెలికితీయాలని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. నాయకత్వ లక్షణాలు అలవడేలా ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలన్నారు. ఒక జిల్లా అధికారి బాగుంటే ఆ శాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది పనితీరు అంతా బాగుంటుందన్నారు. అలాగే ఒక పాఠశాల ప్రిన్సిపాల్ లేదా ప్రధానోపాధ్యాయుడు బాగుంటే ఆ పాఠశాలంతా బాగుంటుంది. ఆ పాఠశాలలోని విద్యార్థులంతా మంచిగా చదువుతారు. నాయకత్వం లక్షణాలు అలవాడేలా నిరంతరం శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే క్రీడల్లో రాణించడం ద్వారా విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకుంటారని వివరించారు. బాల బాలికల ఆరోగ్యం కొరకు ప్రభుత్వం నులిపురుగుల మాత్రలను పంపిణీ చేస్తుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ విజయమ్మ తెలిపారు. ఏడాది నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఈ మాత్రలను జిల్లావ్యాప్తంగా పంపిణీ చేస్తున్నామన్నారు. నులిపురుగుల మాత్రలు వేసుకున్న చిన్నారులు రెండ రోజులు బహిరంగ మలవిసర్జన చేయరాదని సూచించారు. నులి పురుగులు పొట్టలో ఉంటే విద్యార్థులు అనారోగ్యానికి, రక్తహీనతకు గురవుతారని వివరించారు. ఆరు నెలలకు ఒకసారి మాత్రలు వేసుకోవాలన్నారు. పిల్లలు నీరసంగా ఉంటే నులిపురుగుల మాత్రలు వేయాలని సూచించారు. చిన్నారులు తినే ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు అధికంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల ఆర్ డి ఓ టి.చంద్రశేఖర్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ నాగలక్ష్మి, రాజ్ కిరణ్, మలేరియా నివారణ జిల్లా అధికారి సోమ్లా నాయక్, డాక్టర్ జయకుమార్, పాఠశాల ప్రిన్సిపల్ నహీదా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

---

# అంగన్‌వాడీలోని చిన్నారుల సమగ్ర ఎదుగుదలే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలి

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17)

అంగన్‌వాడీలోని చిన్నారుల సమగ్ర ఎదుగుదలే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. ఈ దిశగా దృష్టి సారించాలని సిడిపిఓలకు ఆయన దిశా నిర్దేశం చేశారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు, సిబ్బంది పనితీరుపై మంగళవారం ప్రకాశం భవనంలో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. వయసుకు తగినట్లుగా పిల్లల బరువు, ఎదుగుదల ఉండాలన్నారు. పోషకాహార లోపం, ఎత్తు తక్కువ, బరువు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చెప్పారు. ఇలాంటి పిల్లలు ఉన్న అంగన్వాడి కేంద్రాలతో పాటు సూపర్వైజర్లు లేని ప్రాంతాల్లోని అంగన్వాడీ కేంద్రాలపైనా సిడిపిఓలు మరింత దృష్టి సారిచాలని కలెక్టర్ ఆదేశించారు. నెల రోజుల్లో స్పష్టమైన మార్పు కనిపించాలన్నారు. తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులకు మంచి ఆహారాన్ని ఎన్.ఆర్.సీ.లో కాకుండా స్థానిక అంగన్వాడీ కేంద్రాలు, లేదా చిన్నారుల ఇంటి వద్దే అందించేందుకు ప్రభుత్వపరంగా ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఆయన చెప్పారు. ఈ విధంగా బాధపడుతున్న చిన్నారులకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) ద్వారా సహాయం లభించేలా తాను కూడా చర్యలు తీసుకుంటానన్నారు. సిడిపివోలు నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అంగనవాడి సిబ్బందిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ బి చిన ఓబులేసు, ఐసిడిఎస్ పిడి మాధురి పాల్గొన్నారు.

# నులిపురుగులను నులిమేస్తేనే మంచి ఆరోగ్యం



(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఫిబ్రవరి 17)

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈరోజు5 బద్వేలు పరిధిలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమాన్ని మండల విద్యా శాఖ, ఆరోగ్యశాఖ సంయుక్తంగా నిర్వహించాయి. మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ ప్రమీల, మండల అభివృద్ధి అధికారి, మండల వైద్యాధికారులు, పట్టణ వైద్యాధికారులు మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ జి. రాజేష్ కుమార్ మాట్లాడుతూ నులిపురుగులు ఎలా వ్యాప్తి చెందుతాయో, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆల్బెండజోల్ మాత్రల ప్రాముఖ్యత, వ్యక్తిగత మరియు పరిసరాల పరిశుభ్రత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెన్నకేశంపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అనంతరం ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. బద్వేల్ డివిజనల్ ఉపజిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి. మల్లేష్ అకస్మాత్తుగా పాఠశాలలు మరియు అంగనవాడీ కేంద్రాలను సందర్శించి, మాత్రల పంపిణీ, చేతుల శుభ్రత, అలాగే ఎలాంటి ప్రతికూల ప్రభావాలు ఉన్నాయా అనే విషయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ శ్రీనివాసులు, మండల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శర్మ, సబ్ యూనిట్ ఆఫీసర్ నర్సింహారెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి. వెంగయ్య, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హెల్త్ అసిస్టెంట్ వి జనార్ధన్‌రావు, ఏఎన్ఎం భానుమతి, ఆశా కార్యకర్తలు సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడంతో పాటు నులిపురుగుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# మొదటి బ్యాచ్‌లోనే జేఈఈ మెయిన్స్‌లో ఎస్ఎస్ఎన్ ప్రభంజనం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17)

మంగళవారం సాయంత్రం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ 2026 మొదటి షిఫ్ట్ ఫలితాలలో ఎస్ఎస్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. స్థానిక మంగమూరు రోడ్డు లోని ఎస్ఎస్ఎన్ జూనియర్ కళాశాలలో జెఈఈ మెయిన్స్ మొదలు పెట్టిన మొదటి బ్యాచ్ ఫస్ట్ అటెంప్ట్‌లో బి స్రవంత్ అశోక్ ఓపెన్ క్యాటగిరి లో 97.28 పర్సంటైల్ సాధించి ప్రకాశం జిల్లాకు గర్వకారణంగా నిలిచారని ఎస్ఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్ ఎల్లటూరి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. అలాగే మరో ఐదుగురు విద్యార్థులు 90 పర్సంటైల్ సాధించినట్లు పేర్కొన్నారు. రాసిన 40 మందిలో 17 మంది జేఈఈ అడ్వాన్స్‌కి అర్హత సాదించారు. రానున్న కాలంలో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక దృష్టి సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం నుండి జేఈఈ మెయిన్స్ పరీక్షల నిమిత్తం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ వై శివానందరెడ్డి, డీన్ జనార్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు రఘునాథ్‌రెడ్డి, మధు, చెంచిరెడ్డి, రాజేష్, తదితరులు అభినందించారు.







# రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన శ్రీ సరస్వతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ స్కూల్ విద్యార్థి బి క్రిష్ణ నోహిత

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 17)






విజయవాడలో 14-02-2026న విశ్వం ఎడిటేక్ అబాకస్, వేదిక్ మాథ్స్ వారి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ప్రతిభ పోటీ పరీక్షలను నిర్వహించారు. ఆ పరీక్షల యందు సుమారుగా 900 పైబడి విద్యార్థులు పాల్గొనడం జరిగినది. అయితే మన బద్వేల్ నుండి శ్రీ సరస్వతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, నెల్లూరు రోడ్ యందు చదువుతున్న విద్యార్థిని బి కృష్ణ నోహిత, ఈ అమ్మాయి లక్ష్మిపాళెం లో వుండే సాధారణ రైతు కూలీ అయినటువంటి బసినైనగారి గోపాల్, నాగవేణి దంపతుల కుమార్తె. రాష్ట్రస్థాయిలో తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నందుకు పాఠశాల ప్రిన్సిపాల్ కాకా సుబ్రహ్మణ్యం యాదవ్, పాఠశాల గౌరవ సలహాదారుడు రామ్మోహన్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు. అదే విధంగా మిగతా విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపల్ కాక సుబ్రమణ్యం యాదవ్ మాట్లాడుతూ ఈ అమ్మాయిని ప్రేరణగా తీసుకొని భవిష్యత్తులో మంచిగా చదివి మీ ప్రతిభకు, తల్లిదండ్రులకు, పాఠశాలకు, గురువులకు, సమాజానికి మంచి పేరు తేవాలని తెలియజేశారు.

# జేఈఈ మెయిన్స్ 2026లో టాపర్ సత్తా చాటిన బద్వేలు విద్యార్థి




(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 17)

మెయిన్స్ 2026 సెషన్-1లో 99% పర్సెంటైల్ సాధించడం విశేషం. ఫలితాలతో పాటు టాపర్‌ల జాబితాలో తమ అబ్బాయి ఉండడం ఎంతగానో గర్వించదగ్గ విషయమని 16వ వార్డు వైసిపి ఇన్చార్జ్ నిమ్మకాయల గురువిరెడ్డి అన్నారు. 2026 జనవరి సెషన్ పరీక్షలో టాపర్లను చేర్చిన వివరణాత్మక ప్రెస్ నోట్‌ను కూడా చీూా విడుదల చేసిందని. బద్వేలు ప్రాంతంలో జేఈఈ మెయిన్స్ నందు 99% సాధించిన బద్వేలు వాసిగా తన మనవడు నిమ్మకాయల భాను ప్రకాష్ రెడ్డి కావడం ఎంత సంతోషంగా ఉందన్నారు. ఇటీవల విజయవాడ నందు జరిగిన జేఈఈ మెయిన్స్ నందు బద్వేలు నిమ్మకాయల శివనందరెడ్డి కుమారుడు నిమ్మకాయల భాను ప్రకాష్ రెడ్డి 99 శాతం మార్కులు సాధించి విశ్వశాంతి కాలేజీ టాపర్గా నిలిచారు అన్ని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జేఈఈ మెయిన్స్ 2026 ఫలితాలను అధికారికంగా ప్రకటించిందని. సెషన్-1 ఫలితాల్లో భాను ప్రకాష్ రెడ్డి 99 వ ర్యాంకు రావడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఇటువంటి విజయాలను మరెన్నో పొంది ఉన్నత స్థాయికి తన మనవడు రావాలని మనబడని ఆశీర్వదించారు. అనంతరం 16 వార్డ్ నందు పలువురు వైసీపీ పెద్దలు భాను ప్రకాష్‌రెడ్డిని అభినందించారు. వారి స్వగృహం నందు కేక్ కట్ చేసి ఆనందోత్సవాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో 16 వ వార్డు స్థానికలతో పాటు వైసిపి స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# వీరారెడ్డి కళాశాలలో 20న జాబ్ మేళా

షణ్ముఖ వెలుగు, గోపవరం, ఫిబ్రవరి 17)




పట్టణంలోని ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 20న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సి విజయ్ వినీల్ కుమార్, నియామక విభాగ అధికారి పి శ్రీనివాసరెడ్డి, సమన్వయకర్త మహాలక్ష్మిల సహకారంతో నిర్వహించే ఈ ఉపాధి మేళాలో జై అలుకాస్ ,భారత్ బయోటెక్, ఎల్ఐసి, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ తదితర మొత్తం 13 సంస్థలు పాల్గొని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ మరియు అంతకంటే పై చదువులు పూర్తి చేసిన అభ్యర్థులు తమ జీవిత వివరణ పత్రం, విద్యార్హత ధృవపత్రాలతో హాజరుకావాలని సూచించారు. బద్వేల్ పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7893574673, 9704940639 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు 'పీఎం రాహత్' గొప్ప వరం

### బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుప్రజ



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 17) రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పీఎం రాహత్' పథకం ఎంతో ఉపయుక్తమని బద్వేల్ అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుప్రజ తెలిపారు. ప్రధానమంత్రి మోడీ నాయకత్వంలోని ప్రభుత్వం ఈ పథకం ద్వారా మానవతా దృక్పథంతో ముందడుగు వేసిందన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే 'గోల్డెన్ అవర్'లో అత్యవసర చికిత్స అందించడం ద్వారా అనేక ప్రాణాలను రక్షించవచ్చని ఆమె పేర్కొన్నారు. ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందించడంతో పాటు, ప్రమాదం జరిగిన రోజు నుంచి ఏడు రోజుల వరకు ఉచిత చికిత్స అందించబడుతుందని వివరించారు. అలాగే, ప్రమాదం జరిగిన వెంటనే డయల్ 112కు కాల్ చేస్తే అంబులెన్స్ సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ పథకంపై ప్రజలు అవగాహన పెంచుకుని, అత్యవసర పరిస్థితుల్లో సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## వైభవంగా ఆంజనేయ స్వామికి పాలాభిషేకం, ఆకు పూజ అర్చన





(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 17) మాఘమాసము పురస్కరించుకొని మంగళవారం బద్వేల్ మున్సిపాలిటీ పరిధి 16 వ వార్డు సుమిత్రానగర్‌లో వెలసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, అభయ అంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం ఆలయ పూజారి వీరేశచార్యులు ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకం, ఆకు పూజ, సింధూర అర్చన పలు రకాల విశేష పూజలు నిర్వహించడం జరిగింది. ప్రత్యేక అభిషేక దాతలు ప్రముఖ పైప్ బిజినెస్ వ్యాపారి పబ్బతి సత్య నారాయణ, సతీమణి శ్రీదేవి, అర్బన్ పోలీస్ స్టేషన్ రైటర్ వల్లెశీ ప్రతాప్‌రెడ్డి, సతీమణి లక్ష్మి శిరీష కుటుంబ సభ్యులకు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి వస్త్రంతో సత్కరించి స్వామివారి ప్రత్యేక తీర్థప్రసాదాలను అందజేశారు.

## దుకాణాల తనిఖీలు నిర్వహించిన తూనికలు కొలతల అధికారి సిగరెట్లు అధిక ధరలు అమ్మితే ఖబర్దార్



(షణ్ముఖ వెలుగు, కంభం, ఫిబ్రవరి 17) కంభం, అర్ధవీడు మండలాల్లో పలు షాపులలో తూనికల, కొలతల అధికారి షేక్ మోసిన్ తనిఖీలు చేపట్టారు. అర్ధవీడు మండలంలో 4 కేసులు, కంభంలో 3 కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిగరెట్లు ఎమ్మార్పీ రేట్ల కంటే అధికంగా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల కాలంలో సిగరెట్ల మీద అధిక ధరలు అమ్ముతున్నట్లు తమకు ఆన్లైన్ ద్వారా ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేపట్టమని తెలిపారు.

# రాళ్లపాడు సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17) రాళ్లపాడు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, రిజర్వాయర్ గేట్లు, హెడ్ రెగ్యులేటర్ల ఆధునీకరణపై అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం గళం వినిపించారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు కోసం చేసిన కృషిని గుర్తు చేస్తూనే తక్షణం చేపట్టాల్సిన పనుల గురించి ఎమ్మెల్యే ప్రస్తావించారు. కందుకూరు నియోజకవర్గ ప్రజలకు సాగు, తాగునీరు అందించే ప్రధాన వనరు రాళ్లపాడు రిజర్వాయర్ అని పేర్కొన్నారు. 1958 లో నిర్మించిన ఈ ప్రాజెక్టు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. రాళ్లపాడు ఎడమ కాలువ కింద 4,000 ఎకరాల ఆయకట్టు ఉండగా, ప్రస్తుతం కేవలం 1,500 ఎకరాలకు మాత్రమే నీరు అందుతోంది. కాలువను విస్తరించి, చివరన ఉన్న రైతులకు కూడా నీరు అందించాలి. 1996 వరదల తర్వాత ప్రాజెక్టు మరమ్మతుల్లో భాగంగా గేట్లు ఏర్పాటు చేసినా, 'స్టాప్ లాక్ గేట్లు' లేకపోవడంతో నీటి విడుదలలో ఒక్కోసారి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మెకానికల్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. రిపేర్లు చేయటం కష్టంగా ఉంటుంది. ప్రాజెక్టు భద్రతకు ముప్పు రాకముందే స్టాప్ లాక్ గేట్లను ఏర్పాటు చేయాలి. పురాతన పద్ధతిలో, రాతి కట్టడంతో ఉన్న హెడ్ రెగ్యులేటర్లను మార్చాల్సిన అవసరం ఉంది. ఆధునీకరణ లేకపోవడంతో గతంలో నీళ్లు ఇవ్వటానికి ఇబ్బందులు పడాల్సి వచ్చింది. చివరకు జనరేటర్ సహాయంతో నీళ్లు విడుదల చేశాం. ఆధునిక సాంకేతికతతో హెడ్ రెగ్యులేటర్లను ఆపరేట్ చేసేలా చర్యలు తీసుకోవాలి. వరదలు వచ్చినప్పుడు, వేసవి కాలాల్లో రైతులు, ప్రజలు ఇబ్బంది పడకుండా తక్షణమే నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

**ఎడమకాలువ పనులని పూర్తి చేయాలి**
**స్టాప్ లాక్ గేట్లు ఏర్పాటు చేయండి**
**హెడ్ రెగ్యులేటర్ల ఆధునీకరణలి కూడా అత్యవసరం**
**ఎమ్మెల్యే ప్రశ్నలకు జవాబు ఇచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడు**
**20 నెలల్లో సాగునీటి పనులకు రూ.10.86 కోట్లు మంజూరులి చేసినట్లు ప్రకటన**
**రాళ్లపాడుకు రూ.2.54 కోట్లు ఇచ్చామని వెల్లడి**
**అన్ని సమస్యలు త్వరలోనే పరిష్కారం చేస్తామన్న మంత్రి**



ఎమ్మెల్యే ప్రశ్నకు నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పందిస్తూ.... రాళ్ళపాడు రిజర్వాయర్ ప్రాజెక్టును 1.10 టీఎంసీల సామర్థ్యంతో 16,000 ఎకరాలకు సాగునీరు, 116 గ్రామాలకు త్రాగునీరు అందించే లక్ష్యంతో నిర్మించారు. ఎమ్మెల్యే చెప్పినట్లుగా ఈ రిజర్వాయర్ కుడి కాలువ ద్వారా 14,500 ఎకరాలకు, ఎడమ కాలువ ద్వారా 1,500 ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. రాళ్లపాడు ఎడమ కాలువ పనులు అసంపూర్తిగా నిలిచిన మాట వాస్తవం. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో, 2018లో ఈ పనులకు 36.50 కోట్లు మంజూరు చేశాం. కానీ వైఎస్ఆర్సీపీ అధికారంలోకి వచ్చాక ఈ పనులను రద్దు చేశారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు కోరినట్లుగా రాళ్లపాడు ఎడమ కాలువ పనులు అత్యవసరమని భావించి, వాటికి రీ ఎస్టిమేషన్ వేసి, ఆ పనులను పూర్తి చేస్తాం. రాళ్ళపాడు ప్రాజెక్టుకు సంబంధించి ఈ 20 నెలల కాలంలో 48 పనులకు గాను 2.54 కోట్ల రూపాయలను కూటమి ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే కందుకూరు నియోజకవర్గంలో చెరువులు, కాలువల రిపేర్లు, ఇతర ఆధునీకరణ సహా 140 పనుల కోసం రూ.8.32 కోట్లు మంజూరు చేయడం జరిగింది. రాళ్ళపాడు



రిజర్వాయర్ పురాతనమైనది కాబట్టి ఎమ్మెల్యే నాగేశ్వరరావు కోరిన విధంగా స్టాప్ లాక్ గేట్లు, హైడ్రాలిక్ గేట్లు, ఇతర మెకానికల్ మరమ్మతులను పరిశీలించి, ఆ పనులను పూర్తి చేసే బాధ్యత తీసుకుంటామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలియజేశారు.

## సిపిఐ నేత, సీనియర్ న్యాయవాది 'ముదివర్తి' కి ఘన నివాళి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17) సిపిఐ సీనియర్ నేత, సీనియర్ న్యాయవాది, ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ ముదివర్తి రాఘవరావు మృతికి పలువురు ఘన నివాళులు అర్పించారు. ఒంగోలు నగరంలోని పలువురు వామపక్ష పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, న్యాయవాదులు ముదివర్తి పార్థివ దేహాన్ని సందర్శించి నివాళు లర్పించి, ముదివర్తి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సిపిఐ రాష్ట్ర నాయకులు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు ( అన్న), ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ మానం ఆంజనేయులు ముదివర్తి రాఘవరావు పార్థివ దేహానికి పూలమాలలు వేసి, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే సిపిఐ సీనియర్ నాయకులు కమ్యూనిజం పత్రిక మాజీ సంపాదకులు ఎం సి వెంకటేశ్వర్లు, ఆసరా కేంద్రం అధ్యక్షులు చిడిపోతు వెంకటేశ్వర్లు, పిడిపిఎఫ్ బ్యాంక్ చైర్మన్ పోతినేని వెంకటేశ్వర్లు,ఉప్పుటూరి ప్రకాష్ రావు, మాజీ నగర కార్యదర్శి ఎస్డి సర్దార్, నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు, కారుమూడి నాగేశ్వరరావు, ముఠావర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కందుకూరి సుభాన్ నాయుడు, టెలిఫోన్ డిపార్ట్మెంట్ యూనియన్ నాయకులు కే అంజయ్య, షేక్ రావూఫ్, రామలింగం, అన్నెం కొండల నాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్కె మాబు, జీవి కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, సిపిఐ ఎంఎల్ నాయకులు డివిఎన్ స్వామి, ఎస్ లలిత కుమారి, ఎమ్మెస్ సాయి, ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వడ్డే హనుమా రెడ్డి, కే వీరారెడ్డి ది విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంకు డైరెక్టర్లు నన్నపనేని అంజయ్య, కోటేశ్వరరావు, జోనల్ మేనేజర్ బంగారుబాబు, రాజమండ్రి బ్రాంచ్ మేనేజర్ మూర్తి తదితరులు ముదివర్తి పార్థివ దేహం వద్ద నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**లాయర్ల నివాళి**

సీనియర్ న్యాయవాది ముదివర్తి రాఘవరావు పార్థివ దేహం వద్ద పలువురు లాయర్లు నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొడ్డు భాస్కర్, కే అరుణ, సిహెచ్ నాగేంద్రం, ముదివర్తి రాఘవరావు జూనియర్లు పెళ్లూరి వసుంధర, మోటుపల్లి రేణుక దేవి, కరవది రాఘవరావు, దేవరకొండ శ్రీనివాసమూర్తి, ఎన్ శ్రీనివాస ప్రసాద్, పంగులూరి గోవిందయ్య, కోలా శివప్రసాద్, ఇనకొల్లు వెంకటేశ్వర్లు, లక్ష్మీ కుమారి, దేవ కుమారి, తదితరులు ముదివర్తి మృతికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## పేదలకు ఆత్మీయ ప్యాకేజి అందించిన మానవత





(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 17) మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దాతలు ఆవుల కృష్ణారెడ్డి, వారి సోదరుడు ఆవుల సంజీవరెడ్డి అందించే ఆత్మీయ ప్యాకేజిని ఇటీవల పొదిలి, పరిసర ప్రాంతాలలో మరణించిన 4 కుటుంబాలు పేరం సీతమ్మ (టైలర్స్ కాలనీ), బొజ్జా సుబ్బులు (చిమట), పొదిలి వెంకట సుబ్బయ్య (బుచ్చనపాలెం), కోవెలకుంట్ల వెంకటేశ్వర్లు (కంబాలపాడు), కుటుంబాలకు అందించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కాటూరి వెంకట నారాయణ బాబు, కన్వీనర్ కల్లం వెంకట సుబ్బారెడ్డి, కోశాధికారి సోమిశెట్టి చిరంజీవి, కార్యదర్శి అశోక్ బండి, డైరెక్టర్ యక్కలి శేషగిరి, వరికుంట్ల వినోద్ రాజ్, ఎద్దు నగేష్, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ జంపాల మల్లికార్జునరావుకు ఘన నివాళులు

### 8వ వర్ధంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు




(షణ్ముఖ వెలుగు, కంభం, ఫిబ్రవరి 17) కంభం పరిసర ప్రాంతాల వారికి దాదాపు 45 సంవత్సరాలు విలువైన వైద్య సేవలు అందించి ఈ ప్రాంత ప్రజల గుండెలలో నిలిచిపోయిన మహనీయుడు స్వర్గీయ డాక్టర్ జంపాల మల్లికార్జునరావు అని పలువురు వక్తలు కొనియాడారు. కంభం ప్రాంతానికి చెందిన ప్రముఖ వైద్యుడు, స్వర్గీయ డాక్టర్ మల్లికార్జునరావు 8వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన శిష్యుడు డాక్టర్ ఆచారి ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలలో పలువురు మల్లికార్జునరావు ఆత్మీయులు పాల్గొని ఆయన సేవలను, వ్యక్తిత్వాన్ని గురించి గుర్తు చేసుకొని కొనియాడారు. మాజీ జడ్పీటీసీ, లయన్స్ క్లబ్ సభ్యుడైన జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రస్తుతం సమయంలో ఆయన లేని లోటు పూడ్చలేనిదని, ఆయన ఈ ప్రాంతంలో వైద్య వృత్తికి తలమానికం అని చెప్పారు. రిటైర్డ్ ఎస్ఐ కొండయ్య మాట్లాడుతూ ఎక్కడో సుదూర ప్రాంతమైన గుంటూరు జిల్లా నుండి వచ్చి వెనుకబడిన ప్రాంతం నందు స్థిరపడి నిరుపేదలకు విలువైన వైద్యాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ అని కొనియాడారు. బాదం మనోహర్ మాట్లాడుతూ కంభం ప్రాంతంలో ప్రతి కుటుంబానికి ఆయనతో విడదీయలేని అనుబంధం కలదని, ఇక్కడ లయన్స్ క్లబ్ ను స్థాపించి వైద్య సేవతో పాటు పలు రకాల సామాజిక సేవా కార్యక్రమాలు చేసి, ఎందరో సమాజ సేవకులను తయారు చేశారని జ్ఞప్తి చేసుకున్నారు. అనంతరం ఆయన శిష్యుడు ఆచారి సౌజన్యంతో 50 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేసి, మల్లికార్జున రావు జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన మంచినీటి చలివేంద్రాన్ని ప్రారంభించారు. అదే విధంగా ఆయన జ్ఞాపకార్థంగా ఒక పేద మహిళకు కుట్టు మిషనును ఉచితంగా అందించడం జరిగింది. గురువు పట్ల అభిమానతో ఆచారి చేసిన ఉదారతను అందరూ ప్రశంసించారు. ఈ కార్యక్రమలో లయన్స్ క్లబ్ సభ్యులు పేర్లి గుండయ్య, మహబూబ్ బేగ్, బొర్రా నాగభూషణం, వెంకట సుబ్బయ్య, తీర్థులు స్వామి, బాషు, జిలాని, రమణ తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# విద్యార్థులకు సౌకర్యాలను కచ్చితంగా అందించాలి

## జిల్లా రెవెన్యూ అధికారి బి చిన ఓబులేసు











(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17)

ప్రభుత్వం వసతి గృహాల్లో విద్యార్థులకి కల్పిస్తున్న సౌకర్యాలను పూర్తి స్థాయిలో విద్యార్థులకి కచ్చితంగా అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి బి చిన ఓబులేసు స్పష్టం చేసారు. మంగళవారం ఉదయం నాగులుప్పలపాడు మండలం, పోతవరం గ్రామంలో బీసీ బాలుర వసతి గృహాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వన్ ఇనిస్ట్యూషన్ - వన్ ఆఫీసర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పోతవరం గ్రామంలోని బీసీ వసతి గృహాన్ని తనిఖీ చేయడం జరిగిందని చెప్పారు. వసతి గృహం లోని బాత్రూమ్స్, స్నానపు గదులు, వంట గది, విద్యార్థులు పడుకునే గదులను ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ఆయన మాట్లాడారు. రోజు మెనూ ప్రకారమే భోజనం పెడుతున్నారా, రోజూ పరిసరాలు ఇలానే పరిశుభ్రంగా ఉంటున్నాయా లేక మేము వస్తున్నామని ఇలా ఉంచారా అని అడిగారు. విద్యార్థులు రోజూ ఇలాగే ఉంటుంది సార్ అని చెప్పారు. వసతి గృహాలలో లోపాలని గుర్తించి, వాటిని సరిదిద్దడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, లేకుంటే చర్మ వ్యాధులు ప్రబలుతాయని చెప్పారు. విద్యార్థులకి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని క్రమశిక్షణ కలిగి ఉండి చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి రావాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి నెల డాక్టర్ వచ్చి ప్రతి విద్యార్థినీ పరీక్షించి వారికి ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే గుర్తించాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులున్న విద్యార్థులను గుర్తించి మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఎప్పుడూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి రోజూ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని, ఏదన్న సమస్య ఉంటే వెంటనే స్థానిక తహసీల్దార్ కి తెలియజేయాలని వార్డెన్‌కి చెప్పారు.

**అంగన్వాడీ కేంద్రం తనిఖీ**

నాగులుప్పలపాడు మండలం చదలవాడ గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. పిల్లలకి అందించే ఆహారం, కోడి గుడ్లను ఆయన పరిశీలించారు. పిల్లలకి, గర్భిణీ స్త్రీలకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. పిల్లల ఎత్తు , బరువులను రిజిస్టర్ లో నమోదు చేసిన విధంగా ఉన్నాయా లేక తేడా ఉందా అని ఆయన ఎత్తు, బరువు మిషన్ల ద్వారా పరీక్షించారు. ఎప్పటికప్పుడు పరీక్షిస్తా ఉండాలని, అతి తక్కువ బరువులు ఉన్న పిల్లల్ని సాధారణ ఆరోగ్య కేంద్రాలకు కాకుండా ఎన్ఆర్‌సి సెంటర్స్‌కి మాత్రమే పంపాలని ఆయన ఆదేశించారు. పిల్లల పెరుగుదల, చదువు వివరాలను తల్లి దండ్రులకి తెలియజేయాలన్నారు. నిత్యం సూపర్ వైజర్‌లు, సిడిపీఓలు అంగన్వాడీ కేంద్రాలని తనిఖీ చేసి లోపాలను గుర్తించి వెంటనే సరి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## శిక్ష పడిన ముద్దాయికి సైతం ఉచితంగా న్యాయ సహాయం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17)







అర్హత కలిగిన విచారణ ఖైదీకి , శిక్ష పడిన ముద్దాయికి సైతం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థలు, మండల న్యాయ సేవాధికారి కమిటీలు ఉచితంగా న్యాయ సహాయం చేసి న్యాయవాది నియమిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. మంగళవారం ఒంగోలు పట్టణంలోని జిల్లా జైలును న్యాయమూర్తి తనిఖీ చేసి అక్కడ ఖైదీలకు అందుతున్న భోజన సదుపాయాలను మరియు వసతి సదుపాయాలను పరిశీలించారు అదేవిధంగా అక్కడ ఖైదీలకు నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడుతూ క్షణికావేశంలో తప్పులు చేయటం వలన తమ యొక్క అమూల్యమైన జీవితాలను వ్యర్థం చేసుకోవద్దని తద్వారా కుటుంబాలకు దూరం అవ్వటం వల్ల మానసికంగా ఎంతో వేదన అనుభవించల్సి వస్తుందని న్యాయమూర్తి అన్నారు. అదే విధంగా రాజీ పడదగిన క్రిమినల్ కేసులు ఏమైనా ఉంటే మార్చి 14వ తేదీ జరగబోయే జాతీయ లోక్ అదాలత్ నందు ఇరు వర్గాల ఆమోదంతో వ్యాజ్యాలు పరిష్కరించుకోవచ్చని న్యాయమూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జైలర్ ఎంఏ నాయుడు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జి రవిశంకర్, పి వీర రాఘవులు, జైలు విసిటింగ్ అడ్వకేట్ మొబీనా, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలన్నీ అమలు చేయాలి

### ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17)



రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల నాడు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలులోకి తేవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కమిటీ సమావేశం ఆదివారం సయ్యద్ షర్మిల అధ్యక్షతన జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి పార్టీలు గత శాసనసభ ఎన్నికల నాడు ఇబ్బడి ముబ్బడిగా పథకాలు ప్రకటించి, ప్రజల్ని ఓటు బ్యాంకుగా మలుచుకున్నాయని అన్నారు. ప్రతి మహిళకు ఆడబిడ్డ పథకం కింద నెలకు 1500 చొప్పున ఇస్తామన్న మాట ఇంతవరకు అమల్లోకి రాలేదని అన్నారు. స్త్రీలకు ఉచిత బస్సు పథకం అమల్లోకి వచ్చినా తగినన్ని బస్సులు లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, జిల్లాలోని సగం గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదని ఆమె అన్నారు. మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామన్న ప్రభుత్వం అదనంగా బస్సులు వేసి అన్ని గ్రామాలకి నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు అన్న మాట ఎగతాళిగా మారిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల అవుతుంటే ఎన్ని సిలిండర్లు ఉచితంగా ఇచ్చారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆమె ప్రశ్నించారు. ఉద్యోగాలు వచ్చేవరకు నిరుద్యోగ భృతి నెలకు 3000 చొప్పున ఇస్తామన్నమాట ఈ బడ్జెట్ లో కూడా ప్రస్తావన లేదని అన్నారు. డ్వాక్రా మహిళలకు జీరో వడ్డీ సంగతి ఏమైందో అంతే లేదని ఆమె అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్లో ఇటువంటి పథకాలన్నిటికీ నిధులు కేటాయిస్తారని ఎదురుచూసిన మహిళలు నిరాశ చెందారని ఆమె అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఎన్నికల నాడు ఇచ్చిన వాగ్దానాలు అమలుకు కట్టుబడి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పథకాల అమలు పక్కనపెట్టి మద్యం వ్యాపారం విచ్చల విడిగా పెంచుకుంటూ పోతున్నారని ఆమె అన్నారు. మద్యం మత్తు మందులు, మహిళల మీద పెరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా నాయకురాళ్ళు, యన్.మాలతి, జి.ఆదిలక్ష్మి, ఎస్.కె నాగూర్ బి, బి.గోవిందమ్మ, ఎస్.కె. మదారమ్మ, యస్‌డి అమీరున్నీస్సా, ఎ అంకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## కందికి ప్రభుత్వ మద్దతు ధర రూ.8 వేలు రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలి

### మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 17)

కందికి ప్రభుత్వ మద్దతు ధర రూ.8 వేలు ఇవ్వనుంది. అందుకోసం రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మండలంలోని మల్లవరం, అక్కచెరువు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో కంది కోతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కంది కొనుగోలు కేంద్రం త్వరలో ప్రారంభం కానట్లు తెలిపారు. కావున కంది పంట సాగు రైతులు ప్రభుత్వ మద్దతు ధరకు రూ.8,000లకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రంల ద్వారా విక్రయించేందుకు తప్పనిసరిగా తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అందుకోసం ప్రతి రైతు తమ సమీపంలోని రైతు సేవ కేంద్రాన్ని సంప్రదించి సీఎం యాప్ నందు, పొలం పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు వివరాల ఆధారంగా ఈ- కేవైసీ పూర్తి చేసి నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం గ్రామ రైతులకు ఫార్మర్ రిజిస్ట్రే పోర్టల్ లో రైతులు రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. వ్యవసాయానికి సంబంధించిన ఎటువంటి రాయితులు గాని లేదా పథకాలు గాని పొందాలంటే కచ్చితంగా ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రే పోర్టల్ లో రిజిస్ట్రేషన్ చేయించుకొని యూనిక్ ఐడి నెంబర్ పొందాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.







ఫొటో నెం. 57

**అపరిశుభ్రతకు మారుపేరు తుమ్మలచెరువు**

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఫిబ్రవరి 17)

మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో అపరిశుభ్రంగా వీధులు దర్శనం ఇవ్వడంతో గ్రామంలోని ప్రజలందరూ బెంబేలెత్తుతున్నారు. గ్రామంలోని సచివాలయసిబ్బంది ఉన్నప్పటికీ గ్రామ పరిసరాల శుభ్రతను గురించి పట్టించుకునే పరిస్థితి లేదని గ్రామ ప్రజలు ఆవేదన చెందుతున్నారని ముస్లిం నాయకుడు మీరావలి ఆరోపిస్తున్నాడు. స్థానిక గ్రామంలోని ఆరోగ్య కేంద్రం వద్దనే సైడ్ కాలువ నిండుగా బురదమయమై రోడ్డు పై మురికి నీరు ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతున్నప్పటికీ పట్టించుకునే నాధుడే లేరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు .ఇదే పరిస్థితి కొంత కాలం కొనసాగితే గ్రామంలోని ప్రజలందరూ విషజ్వరాల బారినపడే అవకాశాలు మెండుగా ఉంటాయని ఆయన అధికారులనుకోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తగిన చర్యలు చేపట్టి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండి గ్రామంలో పారిశుధ్యాన్ని తొలగించి త్వరితగతిన ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరారు.

## సమాజానికి రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలు అభినందనీయమం

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, ఫిబ్రవరి 17)








సమాజానికి రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. రెడ్ క్రాస్ సంస్థ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన శిక్షణ, సమావేశ మందిరాన్ని జిల్లా కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు. విపత్కర పరిస్థితులలో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు నిష్ణాతులైన వారిని రెడ్ క్రాస్ సంస్థ సిద్ధం చేస్తుందని కలెక్టర్ అన్నారు. ప్రమాదాలు, ప్రకృతి విపత్తుల సమయాలు, ప్రాణాపాయ పరిస్థితిలలో ఉన్న ప్రజలను కాపాడటమే రెడ్ క్రాస్ సంస్థ ముఖ్య ఉద్దేశం అన్నారు. అలాంటి పరిస్థితుల్లో ప్రజలకు సేవలు అందించడానికి నిష్ణాతులైన యోధులను సిద్ధం చేయడం అభినందనీయమన్నారు. సంస్థ సేవలు మరింత విస్తృతం కావాలన్నారు. నెల రోజుల్లో నాలుగు పర్యాయాలు శిక్షణలు ఇవ్వడానికి రెడ్‌క్రాస్ ప్రణాళికతో పనిచేస్తుందన్నారు. 60 మందికి సాంకేతిక పరిజ్ఞానంతో ఎప్పటికప్పుడు శిక్షణలు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డిఓ పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, తహసిల్దార్ షాలీమా, రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ నారాయణ భట్టు,నాయకులు శివన్నారాయణ, రమణబాబు, చీరాల కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణకు కృషి చేయ్యాలి





(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఫిబ్రవరి 17)

నులిపురుగులతో పిల్లల శారీరక, మానసిక అభివృద్ధి కుంటుపడుతుందని, విషయ సంగ్రహణ అనేది దెబ్బతింటుందని తద్వారా వారి అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని అందుకు గాను 1-19 సంవత్సరాల వయసు గల చిన్నారులందరికీ నులిపురుగుల నివారణ మాత్రలను తప్పకుండా అందించాలని మండల తహశీల్దార్ జె ప్రభాకరరావు,ఎంపిడిఓ ధనలక్ష్మి అన్నారు. మంగళవారం చిన్నగంజాం ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నందు వైద్యదికారి డాక్టర్ పి సాయి శ్రీ చరణ్ ఆద్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దీనోత్సవం సందర్భంగా మండల తహశీల్దార్ జె ప్రభాకరరావు, ఎంపిడిఓ కె ధనలక్ష్మి, ఎంఇఓ అజయ్ బాబు, ప్రిన్సిపాల్ సుమంజిలి లు ఆల్బెండజోల్ టాబ్లెట్లును విద్యార్థులకు పంపిణీ నిర్వహించారు.ఇ సందర్భంగా డాక్టర్ పి సాయి శ్రీ చరణ్ మాట్లాడుతూ చిన్నగంజాం ఆరోగ్య కేంద్రం పరిధిలో 4380 మంది చిన్నారులకు ఆల్బెండజోల్ టాబ్లెట్లు పంపిణీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ చిరంజీవి, హెల్త్ విజిటర్ ఉల్తారాణి, సిహెచ్ఓ ఝాన్సీ రాణి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**సంతరావురు ఆరోగ్య కేంద్ర పరిధిలో...**

నులిపురుగుల ప్రభావంతో పిల్లలు రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, ఆందోళన, కడుపునొప్పి, వికారం, విరేచనాలు బరువు తగ్గడం జరుగుతుందని అందుకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని డాక్టర్ నాగలక్ష్మి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా సంతరావూరు ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సంతరావూరు, గోనసపూడి, చింతగుంపల, కడవకుదురు, మోటుపల్లి గ్రామాల లోని 2- 19 సంవత్సరాల వరకు ఉన్న అంగన్వాడీ, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లోని 1680 బాల బాలికలకు ఆల్బుండాజోల మాత్రలు పంపిణీ జరిగిందని వైద్యాదికారులు డాక్టర్ కె కీర్తి సరోజ్, డాక్టర్ మౌనిక,డాక్టర్ మనోజ్ లు తెలిపారు. ఈ కార్యక్రమనికి చీఫ్‌ఖాూ స్టేట్ నోడల్ ఆఫీసర్, స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ నాగలక్ష్మి పాల్గొని కడవకుదురు అంగన్వాడీ సెంటర్స్ లను సందర్శించి సిబ్బంది పనితీరును పరిశించిచారు. ఇ కార్యక్రమంలో డాక్టర్లు కె. కీర్తి సరోజ్, డాక్టర్ మౌనిక, డా మనోజ్, సిహెచ్ఓ నాగేశ్వరావు, సిబ్బంది పాల్గొన్నారు.